# నేడు జాతీయ విజ్ఞాన దినోత్సవం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి28: ఏటా ఫిబ్రవరి 28ను జాతీయ విజ్ఞాన దినోత్సవంగా జరుపుకుంటున్నాం. భారతదేశం 1986లో ఈ రోజును జాతీయ విజ్ఞాన దినంగా అంగీకరించింది. చంద్రశేఖర్ వెంకటరామన్ 'రామన్ ఎఫెక్ట్' కనుగొన్న రోజైన ఫిబ్రవరి 28 (1928) జ్ఞాపకార్థం జాతీయ విజ్ఞాన దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించింది. రామన్ ప్రభావం ఏంటంటే.. సముద్రపు నీటిపై సూర్యకాంతి పడినప్పుడు ఆ కాంతిలోని నీలం రంగు ఎక్కువగా పరిక్షేపం చెంది మన కంటికి చేరడం వల్లనే సముద్రం నీలంగా కనిపిస్తుందని సి.వి.రామన్ సిద్ధాంతీకరించాడు. ద్రవాలపై పడిన కాంతి కిరణాలు ఎలా పరిక్షేపం చెందుతాయో తెలిపే పరిశోధన ఫలితాన్నే రామన్ ప్రభావం అంటారు. కాంతి కిరణాలు ఒక ద్రవ పదార్థంపై పడినప్పుడు ఆ కాంతి పరిక్షేపం చెందుతుంది. అంటే కాంతి కిరణాల్లోని ఫోటాన్ కణాలు, ద్రవ పదార్థాల పరమాణువులపై పడి పరిక్షేపం చెందుతాయి. చాలా ఫోటాన్లు పడేటప్పటి పౌనఃపున్యంలోనే చెదిరిపోతే, కొన్ని ఫోటాన్లు మాత్రం అంతకు తక్కువ పౌనఃపున్యంతో పరిక్షేపం చెందుతాయి.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :08 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేదీ: శనివారం 01-03-2025 | పేజీలు:4 వెల: 2.00


## కాళేశ్వరం మీద పెట్టిన శ్రద్ధలో 20 శాతం పెట్టినా ఎస్ఎల్‌బీసీ అయిపోయేది!



హైదరాబాద్,గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు మీద పెట్టిన శ్రద్ధలో 20 శాతం పెట్టినా.. ఎస్ఎల్‌బీసీ పూర్తయేది అని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి విమర్శించారు.సొరంగం మార్గంకు టైం పడుతుందని, మొదట్లో లిఫ్ట్ అనుకున్నాం అని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎస్ఎల్‌బీసీని వచ్చే మూడేళ్ళలో పూర్తి చేయాలని చూస్తోందన్నారు. ప్రమాదాన్ని ప్రమాదం లాగ చూడాలని.. రాజకీయం చేయొద్దన్నారు. ఇంతకు ముందు పవర్ హౌజ్‌లో ప్రమాదం జరగలేదా?, కాళేశ్వరంలో జనాలు చనిపోలేదా? అని ప్రశ్నించారు. ఎస్ఎల్‌బీసీ ఎందుకు ఆలస్యం ఎందుకు అయ్యిందనేది కూడా మాజీమంత్రి హరీష్ రావుకి తెలుసు అని గుత్తా చెప్పుకొచ్చారు.'ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం దురదృష్టకరం. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి నీళ్లు తేవాలనేది ఆలోచన. సొరంగం మార్గం టైం పడుతుందని, మొదట్లో లిఫ్ట్ అనుకున్నాం. కృష్ణా బేసిన్లో వాటర్‌పై నిర్లక్ష్యం జరిగింది. కాళేశ్వరం మీద పెట్టిన శ్రద్ధలో 20 శాతం పెట్టినా ఎస్ఎల్‌బీసీ అయిపోయేది. సీఎం, ఇరిగేషన్ మంత్రిగా కేసీఆర్ ఉన్నప్పుడు సమీక్షలు చేసే సమయం ఉండేది కాదు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎస్ఎల్‌బీసీ వచ్చే మూడేళ్ళలో పూర్తి చేయాలని చూస్తుంది. ప్రమాదాన్ని ప్రమాదం లాగ చూడాలి, రాజకీయం చేయొద్దు. ఇంతకు ముందు పవర్ హౌస్ లో ప్రమాదం జరగలేదా?. నువ్వు ఔను అంటే.. నేను కాదు అనడం మంచిది కాదు. హరీష్ రావుకి అన్ని తెలుసు.. ఎందుకు ఆలస్యం ఎందుకు అయ్యింది అనేది కూడా ఆయనకు తెలుసు. ఆత్మపరిశిలన చేసుకుంటే మంచిది. ప్రమాదం జరిగిన గంటలోనే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పాట్లో ఉన్నాడు. నేతలు ఎంత మంది అక్కడికి పోతే.. అంత డిస్ట్రబ్' అని గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు.'పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరుతున్నా. టన్నెల్ కి చాలా షరతులు పెట్టింది అటవీశాఖ. సౌండ్ రాకుండా డ్రిల్ చేయాలని నిబంధన పెట్టారు. హరీష్ రావు విమర్శలు అర్థరహితం. విమర్శలు చేసుకునే సమయమా? ఇది. ఆర్మీ పర్యవేక్షణ ఉంది.. టెక్నికల్ పర్సన్స్ మాట్లాడితే బాగుంటుంది. టన్నెల్ పనులు ఎన్ని అడ్డంకులు వచ్చినా ముందుకు పోవాల్సిందే. ప్రమాదం జరగడం సహజమే, ప్రమాదం పేరు చెప్పి ప్రాజెక్టులు పక్కన పెట్టరు. ఎస్ఎల్‌బీసీ వదిలేశం అంటే.. నిన్ననే హరీష్ రావు మూడు వేల కోట్లు ఖర్చు చేసినం అని అన్నాడు. ప్రాజెక్టు అనువైనది కాదన్నప్పుడు ఎందుకు మూడు వేల కోట్లు ఖర్చు చేశారు. కాళేశ్వరంకి ఇచ్చిన అడ్వాన్స్ లు ఎస్ఎల్‌బీసీ ఇస్తే ప్రాజెక్టు పూర్తి అయ్యేది' అని గుత్తా మండిపడ్డారు.

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి 9 పేజీల లేఖ



హైదరాబాద్,ఫిబ్రవరి28:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి 9 పేజీల లేఖ రాశారు. 'తెలంగాణ రాష్ట్రానికి ప్రాజెక్టుల మంజూరులో కేంద్ర క్యాబినెట్ మంత్రిగా మీ బాధ్యతను గుర్తు చేయడం కోసం లేఖ' అని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రాలకు ప్రాజెక్టుల మంజూరులో సీఎం రేవంత్ రెడ్డి అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారన్న వ్యాఖ్యలు పూర్తి బాధ్యతారాహిత్యమని, తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రిగా తెలంగాణకు కిషన్ రెడ్డి ఏం చేశారో చెప్పాలన్నారు. తెలంగాణ అభివృద్ధికి హైదరాబాద్ మెట్రో ఫేజ్, ప్రాంతీయ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్), మూసీ పునరుజ్జీవనం, రీజినల్ రింగ్ రైలు, డ్రైపోర్ట్ ఏపీలోని బందరు సీ పోర్టుకు గ్రీన్ ఫీల్డ్ రహదారి కీలకమని అన్నారు. వాటి నిర్మాణాలకు సంబంధించి అనుమతుల కోసం కేంద్ర ప్రభుత్వ విధివిధానాలను పూర్తిగా పాటిస్తున్నామని తెలిపారు. ఆయా ప్రాజెక్టుల సాధన కోసం ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులతో పాటు మిమ్మల్ని (కిషన్ రెడ్డి) కలిసిన విషయాన్ని గుర్తు చేస్తున్నానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మెట్రో ఫేజ్ -1 69 కి.మీ. నిర్మాణాన్ని ఉమ్మడి రాష్ట్రంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. మెట్రో రాకతో హైదరాబాద్ నగరంలో అభివృద్ధి పరుగులు పెట్టిందని, గత పదేళ్లలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 ప్రాజెక్ట్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, సీఎంగా తాను బాధ్యతలు స్వీకరించిన తర్వాత హైదరాబాద్ మెట్రో ఫేజ్-11 ప్రాజెక్టుపై పూర్తి స్థాయిలో దృష్టి సారించామని తెలిపారు. మెట్రో సేవలను విస్తరించడమే లక్ష్యంగా అయిదు కారిడార్లను ప్రతిపాదించామన్నారు. నాగోల్- రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (36.8 కి.మీ.), రాయదుర్గం-కోకాపేట నియోపొలిస్ (11.6 3.2.), ఎంజీబీఎస్- చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.), మియాపూర్-పటాన్ చెరు (13.4 కి.మీ.), ఎల్బీనగర్- హయత్ నగర్ (7.1 కి.మీ.). ఈ ఐదు కారిడార్ల నిర్మాణానికి రూ. 24,269 కోట్లతో ప్రతిపాదనలు ఆమోదించాలని నాటి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీకి (2024, జనవరి 4వ తేదీ) వినతిపత్రం అందజేశామని చెప్పారు. 2024, అక్టోబరు ఏడో తేదీన ప్రస్తుత కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్కు ప్రతిపాదనలు అందజేశామని తెలిపారు. 2024, నవంబరు నాలుగో తేదీన రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖకు మెట్రో ఫేజ్- 11 డిటైయిల్డ్ రిపోర్ట్ సమర్పించామని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. 2024, డిసెంబరు 12వ తేదీన ఢిల్లీలో తాను మీతో (కిషన్ రెడ్డి) సమావేశమై హైదరాబాద్ మెట్రో ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాల లేఖను అందజేశానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తాజాగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసినప్పుడు 2025, ఫిబ్రవరి 26వ తేదీన ఇదే అంశంపై లేఖ అందజేశానన్నారు. మెట్రో ఫేజ్-కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టాలని అన్ని లేఖల్లో స్పష్టంగా వివరించినట్లు ఆయన తెలిపారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు సహకరించాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను 2024, జులై 22న కలిసి వివరాలతో కూడిన లేఖను అందజేశామన్నారు. మీతో (కిషన్ రెడ్డి) సమావేశమైన రోజు మూసీ పునరుజ్జీవన ప్రాధాన్యాన్ని వివరించడంతో పాటు సమగ్ర వివరాలతో లేఖను అందజేశానని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ నెల 21వ తేదీన రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ అధికారుల బృందం మిమ్మల్ని కలిసి మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని వివరించారన్నారు. తాజాగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మూసీ పునరుజ్జీవంపై లేఖను అందజేశానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## రాజధానిని పట్టాలకు ఎక్కిస్తున్నాం

అమరావతి,ఫిబ్రవరి28: ఎన్నికల హామీల అమలుకు తాము కట్టుబడి ఉన్నామని ఏపీ ప్రభుత్వం తాజా బ్జడెట్ ద్వారా స్పష్టం చేసింది. సూపర్ సిక్స్, మేనిఫెస్టో హామీలు, అభివృద్ధి పనులకు ఎక్కువ కేటాయింపులు జరపడంతో 2025-56 ఏపీ బడ్జెట్ తొలిసారిగా రూ.3 లక్షల మార్కును దాటింది. సభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రవేశ పెట్టారు. రాజధానిని పట్టాలెక్కిస్తున్నామని చెప్పిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్.. ఈ బడ్జెట్ అమరావతి నిర్మాణానికి రూ.6 వేల కోట్లు కేటాయించారు. సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ పలు పథకాలకు కార్యక్రమాలకు భారీ కేటాయింపులు జరిపారు. తొలిసారిగా తెలుగు భాషాభివృద్ధికి కూడా నిధులు కేటాయించారు. ఏకంగా రూ.10 కోట్ల నిధులు కేటాయించామని వెల్లడించారు. సంక్షేమానికి, వివిధ అభివృద్ధి పథకాలకు ఈసారి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేసింది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మార్గదర్శకత్వంలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలనే లక్ష్యంతో గ్రామీణాభివృద్ధిలో ముందడుగు వేస్తున్నామని అన్నారు. రాజధాని పనులు త్వరలో ప్రారంభం కాబోతున్నాయని, రాష్ట్రాభివృద్ధికి గ్రోత్ ఇంజనులా రాజధాని అమరావతిని అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. గతేడాది రూ. 2.94. లక్షల కోట్లతో వార్షిక బ్జడెట్ ప్రవేశపెట్టగా ఈసారి బ్జడెట్ రూ.3 లక్షల 22 వేల 359 కోట్లకు చేరింది. వ్యవసాయ రంగానికి భారీగా కేటాయింపులు పెరిగాయి. అన్నదాతల కోసం కూటమి ప్రభుత్వం ఈసారి రూ.48,340 కోట్లను కేటాయించింది. గతేడాది బడ్జెట్ రూ. 43,402.33 కాగా ఈసారి కేటాయింపులు భారీ స్థాయిల పెరిగాయి. ఈసారి ద్రవ్యలోటు రూ.79,926 కోట్లు ఉండొచ్చని అంచాన వేసింది. ఎన్టీఆర్ వైద్య భరోసాకు రూ.31,613 కోట్లు కేటాయించారు. తల్లికి వందనం కోసం రూ.9,407 కోట్లు, బీసీ సంక్షేమానికి రూ.23,260 కోట్లు, వైద్యారోగ్య శాఖకు రూ.19,260 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధికి రూ.16,739 కోట్లు కేటాయించగా ఈసారి కేటాయింపులు రూ.18,848 కోట్లకు చేరాయి. మూల ధన అంచనా వ్యక్తం రూ.32,712 కోట్లు నుంచి రూ.40,635 కోట్లకు పెరిగింది. జలవనరుల అభివృద్ధి బడ్జెట్ రూ.16,705 కోట్ల నుంచి రూ.18,020 కోట్లకు పెరిగింది. పాఠశాల విద్యకు గతంలో రూ. 29,909కోట్లు ఈసారి కేటాయింపులు రూ.31,806 కోట్లకు చేరాయి. గత బడ్జెలో పరిశ్రమలు వాణిజ్యం రూ. 3,127కోట్లు కాగా ఈసారి రూ.3,156 కోట్లు కేటాయించారు. యువజన,



సాంస్కృతిక శాఖకు గతంలో 322కోట్లు కాగా ఈమారు రూ.469 కోట్లకు పెంచారు. పోలవరానికి రూ.6,705 కోట్లు కేటాయించారు. బీసీ సంక్షేమానికి గత బ్జడెట్‌లో రూ.39007 కోట్లు కేటాయించగా ఈసారి నిధులను రూ.47,456 కోట్లకు పెంచారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి వరుసగా గతంలో రూ.18497 కోట్లు, రూ.7557 కోట్లు కేటాయించగా ఈసారి కేటాయింపులు ఎస్సీలకు రూ.20,281 కోట్లు, ఎస్టీ సంక్షేహానికి రూ.8,159 కోట్లకు చేరాయి. ప్రకృతి సేద్యం ప్రోత్సాహానికి రూ.62 కోట్లు, ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ. 11,314 కోట్లు, మత్స్యకార భరోసాకు రూ.450 కోట్లను కూటమి ప్రభుత్వం కేటాయించింది. ఆదరణ పథకం కోసం రూ.1000 కోట్లు, మనబడి పథకం కోసం రూ.3,486 కోట్లు, తల్లికి వందనం కోసం రూ.9,407 కోట్లు, దీపం 2.0 పథకానికి రూ.2,601 కోట్లు కేటాయించింది. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రగతికి పరుగులు పెట్టించేలా వివిధ విధాన నిర్ణయాలు ఉన్నాయని బ్జడెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం అప్పులనే కాదు.. చెత్తను వారసత్వంగా ఇచ్చిందని అన్నారు. చెత్త పన్ను వేయడమే కాకుండా.. 83 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను ఎత్తకుండానే వైసీపీ ప్రభుత్వం వెళ్లిపోయిందని వ్యాఖ్యానించారు. తెలుగు భాషాభివృద్ధికి రూ. 10 కోట్లు కేటాయింపులు చేపట్టిన విషయాన్ని వెల్లడించారు. కాలుష్య రహిత ఆంధ్రగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు చేపడుతున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం పెంచేలా చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు.

## రూ. 48,340 కోట్లతో వ్యవసాయ బడ్జెట్



అమరావతి,ఫిబ్రవరి28: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుక్రవారం నాడు అసెంబ్లీలో వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు దీనిని సభలో ప్రవేశపెట్టారు. ఇందులో రైతులకు శుభవార్త చెప్పారు. మొత్తం రూ. 48,340 కోట్లతో వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రభుత్వం.. ఆయా రంగాలకు భారీగా కేటాయింపులు చేసింది. వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.13,487 కోట్లు కేటాయించారు. దేశం, రాష్ట్రం అభివృద్ధికి వ్యవసాయమే ఆధారమని మంత్రి అచ్చెన్న పేర్కొన్నారు. వికసిత్ భారత్‌కు అనుసం ధానంగా ఏపీ పురోభివృద్ధి ఉంటుందన్నారు. సాంకేతికతతో సాగు ఖర్చులు తగ్గించాలనేదే లక్ష్యంగా చెప్పారు. దేశం, రాష్ట్రం అభివృద్ధికి దోహదపడేది వ్యవసాయ రంగమని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.ప్రధాన వనరైన వ్యవసాయాన్ని ప్రాథమిక రంగంగా గుర్తించామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. రైతులను స్థితిమంతులుగా చూడాలని ఆకాంక్షిస్తూ స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాన్ని సాధించే దిశగా అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. వికసిత్ భారత్ 2047కు అనుసంధానంగా ఏపీని ప్రగతిపథంలో ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి వెల్లడించారు.గత ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.120 కోట్ల విత్తన రాయితీ చెల్లించామని అసెంబ్లీ వేదికగా మంత్రి ప్రకటించారు. 35.8 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువు సరఫరా చేశామన్నారు. వ్యవసాయ రంగంలో తొలిసారి డ్రోన్‌ల వినియోగం చేపట్టామని మంత్రి అచ్చెన్న తెలిపారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భూమి ఉన్న రైతుకు గుర్తింపు సంఖ్య ఇస్తున్నామని.. అర్హులైన కౌలు రైతులకు హక్కు కార్డులు మంజూరు చేస్తామని మంత్రి చెప్పారు. ఎరువులు, ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ యంత్రాల రాయితీ, డ్రోన్ల రాయితీకి సంబంధించి భారీగా కేటాయింపులు జరిపారు. ఈ కేటాయింపుల వల్ల రైతులకు భారీగా మేలు చేకూరనుంది.వ్యవసాయ బడ్జెట్లో గ్రోత్ ఇంజిన్లుగా 11 పంటలను ప్రభుత్వం పేర్కొంది.ఎరువుల స్టాక్ నిర్వహణకు రూ.40 కోట్లు,ప్రకృతి వ్యవసాయం ప్రోత్సాహానికి రూ.61 కోట్లు,వ్యవసాయ యంత్రాల రాయితీకి రూ.139 కోట్లు, 7.78 లక్షల క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేశామని అన్నారు. అలాగే డ్రోన్ల రాయితీ కోసం రూ.80 కోట్లు,875 కిసాన్ డ్రోన్ వ్యవసాయ యాంత్రీకరణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వ్యవసాయ యాంత్రీకరణకు రూ.219 కోట్లు, విత్తన రాయితీ పంపిణీకి రూ.240 కోట్లు.రైతులకు వడ్డీలేని రుణాల కింద రూ.250 కోట్లు., అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ అమలుకు రూ.9,400 కోట్లు., ఉచిత పంటల బీమా కోసం రూ.1,023 కోట్లు., వ్యవసాయ శాఖకు రూ.12,401 కోట్లు., ఉద్యాన శాఖకు రూ.930.88 కోట్లు., పట్టుపరిశ్రమకు రూ.96.22 కోట్లు,సహకారశాఖకు రూ.239.85 కోట్లు.పశుసంవర్ధక శాఖకు రూ.1,112.07 కోట్లు.,మత్స్య రంగానికి రూ. 540.9 కోట్లు కేటాయించారు. వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రి అచ్చెన్నాయుడు కీలక ప్రసంగం చేశారు.ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రసంగం ముగిసిన వెంటనే.. శాసనసభలో వ్యవసాయ బడ్జెట్ ను ఆ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రవేశ పెట్టారు.. ప్రకృతి వ్యవసాయం పై దృష్టి పెట్టాం.. ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం పై కూటమి సర్కార్ ఫోకస్ పెట్టిందన్నారు.. వ్యవసాయం ప్రాథమిక రంగంగా గుర్తింపు ఉంది.. రాష్ట్రంలో భూమి కలిగిన వారికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఇవ్వనున్నట్టు వెల్లడించారు.. ఇక, శాసనమండలిలో వ్యవసాయ బడ్జెట్ 2025-26 ను మంత్రి నారాయణ ప్రవేశపెట్టారు..

## నేను కూడా సైన్స్ విద్యార్థినే.. అధ్యాపకుడిగా పనిచేశా...




హైదరాబాద్,'జాతీయ సైన్స్‌డే' సందర్భంగా హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరుగుతున్న నేషనల్ సైన్స్ డే ఎగ్జిబిషన్‌కు కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్, సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు.ఓపెన్ టాప్ జీపులో స్టేడియంలో ఉన్న స్కూల్ అండ్ కాలేజ్ విద్యార్థులందరికీ కేంద్రమంత్రి, సీఎం అభివాదం చేశారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, సర్ సీవీ రామన్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. డీఆర్‌డీవో, డిఫెన్స్, ఏరోస్పేస్ ఉత్పత్తులకు చెందిన 200 స్టాల్స్ ఏర్పాటు చేశారు. విజ్ఞాన్ వైభవ్ ప్రదర్శనలో రాజ్‌నాథ్ మాట్లాడుతూ తాను కూడా సైన్స్ విద్యార్థినే అని చెప్పారు.'సర్ సీవీ రామన్ ఫిబ్రవరి 28న రామన్ ఎఫెక్ట్‌ను కనుగొన్నారు. నోబెల్ గ్రహీత రామన్ గౌరవార్థం ఫిబ్రవరి 28ని జాతీయ సైన్స్ దినోత్సవంగా మనం నిర్వహించుకుంటున్నాం. నేను కూడా సైన్స్ విద్యార్థినే. రాజకీయాల్లోకి ప్రవేశించే ముందు కొన్నాళ్లు సైన్స్ అధ్యాపకుడిగా కూడా పనిచేశాను. ఇంతటి విద్యార్థి సందోహాన్ని ఉద్దేశించి ప్రసంగించడం నాకు చాలా సంతోషంగా ఉంది. మానవ పరిణామాన్ని, సైన్స్ అభివృద్ధిని విద్యార్థులు అధ్యయనం చేయాలి. యువతి యువకులు శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకోవాలి. గ్లోబల్ లీడర్ షిప్ లో యువతదే కీలక పాత్ర. సైన్స్ టెక్నాలజీలో వచ్చే మార్పుల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి. రక్షణ శాఖ చారిత్రాత్మక విజయాల్లో కేంద్రం విశేష పాత్ర పోషిస్తుంది. ఈ శాఖకు గత కొద్ది సంవత్సరాలుగా మంత్రిగా ఉండటం నా అదృష్టం. సైన్స్ అండ్ టెక్నాలజీ లో కొత్త ఒరవడిని భారతదేశం సృష్టిస్తోంది. పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. అన్ని రంగాల్లో భారత దేశం అగ్రగామిగా ఉంది. మానవుని మేధ సంపత్తు చాలా గొప్పది' అని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ%ౌ% 'దేశం రక్షణ బాధ్యత యువతి, యువకులపై ఉంది. రక్షణ శాఖ దేశాన్ని కాపాడంలో కీలక పాత్ర వహిస్తుంది. మిస్సైల్స్ తయారీ చేసే పరిశ్రమలు డీఆర్‌డీఎల్, బీడీఎల్, డీఆర్‌డీవో తెలంగాణాలో ఉండడం సంతోషం. ప్రతియేటా మెకానికల్ & ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న లక్షకు పైగా విద్యార్థులు ఉద్యోగం కోసం అమెరికా వెళుతున్నారు. తెలంగాణలో ఈరోజు ఏర్పాటు చేసిన డీఆర్‌డీవో ఎగ్జిబిషన్ ఎంతగానో దోహదపడుతుంది. బెంగళూరు తరహాలో తెలంగాణ రాష్ట్రంలోనూ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో రక్షణ శాఖ కారిడార్లు ఏర్పాటు చేయాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కోరుతున్నాను' అని పేర్కొన్నారు.

## అడిగిన దానికి తప్ప.. అన్నింటికీ హరీశ రావు స్పందిస్తారు!

హైదరాబాద్,ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను గత ప్రభుత్వం ఎందుకు పూర్తి చేయలేదు? అని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశ్నించారు. 2014 నుండి 2023 వరకు 200 కిలోమీటర్ల టన్నెల్ పనులు చేశాం అని హరీశ్ రావు అంటున్నారు, పదేళ్లలో మిగిలిన 19 కిమీ ఎందుకు తవ్వలేక పోయారన్నారు.హరీశ్ రావు సొల్లు పురాణం మాటలు మస్తు చెప్తాడని ఎద్దేవా చేశారు. అడిగిన దానికి తప్ప.. అన్నిటికి హరీశ్ రావు స్పందిస్తారని విమర్శించారు. ప్రమాదం జరగగానే హరీష్ రావు ఎందుకు రాలేదు? అని మంత్రి జూపల్లి ప్రశ్నించారు. గాంధీ భవన్‌లో మంత్రి జూపల్లి మీడియాతో మాట్లాడారు.'ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌కి హరీష్ రావు వంద వాహనాల్లో యుద్ధానికి వెళ్లినట్టు వచ్చారు. అడిగిన దానికి తప్ప.. అన్నింటికీ ఆయన స్పందిస్తారు. 2014 నుండి 2023 వరకు 200 కిలోమీటర్ల టన్నెల్ పనులు చేశాం అంటున్నారు, పదేళ్లలో మిగిలిన 19 కిమీ ఎందుకు తవ్వలేకపోయారు. డబ్బులు లేక తవ్వలేదా ఎస్ఎల్‌బీసీ లేదా.. కాంగ్రెస్ పార్టీకి పేరు వస్తుందని తవ్వలేదా?. హరీష్ సొల్లు పురాణం మాటలు మస్తు చెప్తాడు. ప్రమాదం జరగగానే హరీష్ ఎందుకు రాలేదు. నేను ఒక్కడినే టన్నెల్ లోపలికి వెళ్ళాను. టన్నెల్‌లోకి వాటర్, బురద వచ్చి ముసుకుని పోయింది. అది తీస్తే మరలా వరద వస్తది కదా. 8 మందిని తీయడానికి 100 మంది లోపలికి పోయారు. బురద, నీళ్లు వస్తున్నప్పుడు మళ్ళీ ప్రమాదం జరిగితే.. ఇంకో ఘటన



జరుగుతుంది కదా?. జాగ్రత్తగా చేయాల్సి ఉంటుంది. జాతీయ సంస్థలు అన్నీ వచ్చాయి, ఆ సంస్థలు చెప్పినట్టు చేస్తున్నాం' అని మంత్రి జూపల్లి తెలిపారు.'జిల్లా మంత్రిగా నేనే టన్నెల్‌లోకి వెళ్లి వచ్చా. మమ్మల్ని రానివ్వలేదు అని కొందరు డ్రామా చేశారు. రావడానికి అనుమతి ఇచ్చింది మేమే, రాజకీయ లబ్ధి కోసం డ్రామా చేస్తున్నారు. మీరేమైనా అధికారంలో ఉన్నప్పుడు అనుమతి ఇచ్చారా?. వచ్చి చూడాలి అనుకుంటే.. 100 వాహనాల్లో వస్తారా?. పాలమూరు రంగారెడ్డిలో ప్రమాదం జరిగితే కేసీఆర్ వచ్చాడా?.. పవర్ హౌస్ మునిగితే కేసీఆర్

# సంపాదకీయం

శనివారం 01-03-2025

## వాణిజ్య పంటలకు మార్కెట్ కల్పించలేని పాలకులు !

రకరకాల వాగ్దానాలు..రకరకాల పథకాలు...రైతులను ఆదుకునేందుకు మద్దతు ధరలు..ఇలాంటి ప్రకటనలతోప్రభుత్వాలు ప్రకటనలు గుప్పించి అధికారంలోకి వస్తున్నా..అన్నదాతల విషయంలో ఏ ప్రభుత్వం కూడా ముందుచూపుతో వ్యవహరించడం లేదు. దీనికంతటికి ఈ దేశంలో సమగ్ర వ్యవసాయ విధానం లేదు. ఏ పంటలు పండించాలి..ఏ పంటలు ఎగుమతి చేయాలన్న దానిపై పాలకులకు అవగాహన లేకుండా పోతోంది. రైతుల నుంచి సమాచారం వచ్చినా పట్టించుకోవడం లేదు. ప్రధానంగా మనదేశంలో వరి,గోధుమ, జొన్నలు లాంటి తృణధాన్యాలతో పాటు, వాణిజ్య పంటలకు కూడా అవకాశం ఉంది. మన నేతలు అన్ని పంటలకు అనువుగా ఉన్నాయి. ప్రధానంగా వాణిజ్య పంటలను విపరీతంగా పండించే ఛాన్స్ ఉంది. మిర్చి, పసుపు, పత్తి, అల్లం వెల్లుల్లి లాంటి పంటలను కూడా ఎగుమతులు చేసేలా పండించుకునే వీలుంది. రైతులు చెమటోడ్చి ఈ పంటలను ఏటా పండిస్తూనే ఉన్నారు. అయినా పంటల దిగుబడి రాగానే మద్దతు ధరల పేచీ...ఎగుమతుల విధానంలో పేచీ...ఇలా సవాలక్ష కొర్రీలతోరైతులను ఆగం చేస్తున్నారు. ఇంతెందుకు ఇటీవల ఏపిలో మిర్చి పండించిన రైతులకు ప్రభుత్వాలు చుక్కలు చూపుతున్నాయి. తెలంగాణలో మిర్చితో పాటు పత్తి, పసుపు పంటలకు సకాలంలో గిట్టుబాటు ధరలు రావడం లేదు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ గురించి కబుర్లు చెబుతున్న సిఎం చంద్రబాబు నాయుడు మిర్చి సేకరణ విషయంలో పూర్తిగా విఫలం అయ్యారు. తెలంగాణలోనూ అదే పరిస్థితి. పండించిన పంటలను కొనుగోలు చేసి, పేదలకు తక్కువ ధరలకు అమ్మడం కూడా ఓ రకంగా ఆదుకోవడమే అవుతుంది. ఎగుమతులను పెంచుకోవడం ద్వారా రైతులను అండగా నిలవవచ్చు. కానీ అలా జరగడం లేదు. రూపాయికే కిలో బియ్యం ఇస్తున్న ప్రభుత్వం ఈ దండగమారి పథకాన్ని ఎత్తేయడం ఉత్తమం. ఉపాధిహామీతో పనికిరాని పనులు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఉచిత పథకాలతో కూలీలు కూడా దొరకడం లేదని సుప్రీం జడ్జి వ్యాఖ్యానించినా మొద్దు నిద్ర వీడడం లేదు. తమ భద్రతకు వేలకోట్లు ఖర్చు చేస్తున్న నాయకులు రైతుల కోసం మాత్రం బిచ్చం పడేసినట్లుగా వ్యవహరిస్తున్నారు. తాజాగా ఏపిలో మిర్చి రైతులు గిట్టుబాటు ధరలు లేక ఆందోళన చెందుతున్నారు. తెలంగాణలో కూడా ఇప్పుడు మిర్చి బాగా పండింది. నిజానికి వ్యవసాయాధారిత పరిశ్రమలను పెట్టి పంటలను కొనుగోలు చేసి, మిర్చి పౌడర్‌ను తక్కువ ధరకు ప్రజలకు అందించవచ్చు. దీంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. మార్కెట్లో డబ్బు చెలామణి అవుతుంది. ప్రభుత్వం, ప్రైవేట్ రంగంలో ప్రోత్సాహకాలతో పంటలను అమ్మించే ప్రయత్నం చేయవచ్చు. దిగుమతులు తగ్గించి, ఎగుమతులను పెంచితే విదేశీ మారకం పెరుగుతుంది. కానీ అలా చేయడం లేదు. ఏపిలో పీకల్లోతు కష్టాల్లో ఉన్న మిర్చి రైతులను బేషరతుగా ఆదుకోవడానికి బదులుగా కేంద్ర ప్రభుత్వం అనేక ఆంక్షలు పెట్టడం, రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూడడం కూడా తప్పే. ఇలాంటి సందర్భంలో ఎలా ఆదుకోవాలన్న ఆలోచన లేకుండాపోతోంది. లక్షల రూపాయలు పెట్టుబడి పెడితేగాని మిర్చి సాగు సాధ్యం కాదు. నారు నాటినప్పటి నుండి పంట చేతికివచ్చేంతవరకు మిర్చి రైతుది దినదిన గండం బతుకే! చీడ, పీడలు, తెగుళ్ల బెడద ప్రతిరోజూ వెంటాడుతున్నది. వీటన్నింటిని అధిగమించి యార్డు దాకా తెచ్చిన సరుకుకు నామమాత్రపు ధర కూడా పలకకపోతే సాగు చేసిన రైతు పరిస్థితి ఏమిటన్న ఆలోచన చేసేదెవరు. ఆదుకోవాలని కోరితే పండిన పంటలో పావు వంతే కొంటామనడం ఏ విధమైన ఊరడంపో అర్థం కాదు. మిగిలిన పంటను ఎవరికి అమ్ముకోవాలన్నది వారే చెబితే బాగుండేది. గత ఏడాది గరిష్టంగా క్వింటాకు 28 వేల రూపాయలు ధర పలికితే, ఇప్పుడు కేవలం 11,781 రూపాయల రేటు ఎలా నిర్ణయించారు. దీనికి ప్రాతిపదిక ఏమిటన్నద ఇపాలకులు వివరించాలి. అది కూడా నెలరోజుల వరకే కొంటామని చెప్పడం మరీ దారుణం. ఈ తరహా విధానాలు మిర్చి రైతాంగానికి పెనుశాపంగా మారాయి. కేంద్ర ప్రభుత్వం మద్దతుగా ప్రకటించిన 11,781 రూపాయలను ప్రామాణికంగా తీసుకుని గత ఏడాది ధరలతో పోలిస్తే ఎకరాకు రెండు లక్షల రూపాయల నష్టం వస్తుందని రైతులు లెక్కలు వేసి చెబుతున్నారు. ఇంత ఘోరంగా పరిస్థితులు ఉంటే, రాష్ట్రంలో ఏ రైతు కూడా కష్టాల్లో లేరని ఉభయ సభల నుద్దేశించి చేసిన ప్రసంగంలో గవర్నర్ చేత రాష్ట్ర ప్రభుత్వం చెప్పించడం మరీ దారుణం! ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో నెలకొన్న వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం గుర్తించాలి. తక్షణం నాఫెడ్, మార్క్‌ఫెడ్‌లను రంగంలోకి దించి రైతాంగం కోరుతున్నట్లు క్వింటాకు కనీసం 20 వేల రూపాయల చొప్పున చెల్లించి, మొత్తం పంటను కొనుగోలు చేయాలి. అన్ని రకాల షరతులను ఎత్తివేయాలి. దీనికోసం అవసరమైతే కలిసివచ్చే శక్తులను కలుపుకుని కేంద్రంపై ఒత్తిడి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం కావాలి. పాలక కూటమికి రాజకీయంగా ఇబ్బంది అనుకుంటే రైతులను, అన్ని రాజకీయ పార్టీలను సమీకరించి కేంద్రం వద్దకు వెళ్లాలి. ఢిల్లీ పాలకుల మెడలు వంచి మిర్చి రైతులకు న్యాయం జరిగేలా చూడాలి. ఒకసారి రైతు ఈ ధరకు పావు వంతు సరుకును అమ్మిన తరువాత మిగిలిన సరుకుకు ఎంత ధర పలుకుతుందో తెలియంది కాదు. ట్రేడర్లు అంతకన్నా తక్కువకే కొంటారు తప్ప ధరలు పెంచరు. నెలరోజుల గడువు ముగిసిన తరువాత మార్కెట్‌కు వచ్చే సరుకు పరిస్థితి ఏమిటన్న ఆలోచన కూడా చేయరంటే...వీరికి పంటలపై ఎలాంటి అవగాహన ఉందో తెలుసుకోవచ్చు. ఉదయం లేచింది మొదలు మార్కెట్ ఎకానమి సూత్రాలను వల్లించే కేంద్ర ప్రభుత్వ పెద్దలకు మార్కెట్ ఒడిదుడుకులు, పంటల గురించి అవగాహన లేదనుకోవాలి. లాభాల పంటను, రైతులకు నష్టాల మంటను మిగల్చడం కాక మరోటి కాదు. ఆర్థికంగా రాష్ట్రం అనేక కష్టాలు ఎదుర్కొంటుంటే వర్కింగ్ కేపిటల్‌ను ఏర్పాటు చేసుకోవాలనడం, ఖర్చులో సగభాగాన్ని రాష్ట్రమే భరించాలని కేంద్రం షరతులు పెట్టడం మరింత దుర్మార్గం. ఇంత నిర్దయగా కేంద్రం వ్యవహరించినా, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు పెదవి విప్పడానికి సైతం సిద్ధపడకపోవడం బాధాకరం! తెలుగు ప్రజల ఆత్మగౌరవ నినాదంతో ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ తీరు, రైతులను ఆదుకనేలా లేదు. సొంతంగా పంటల కొనుగోలు విధానాలు అవలంబించాలి. గుంటూరు మిర్చి యార్డు నుండి చైనా, శ్రీలంక, బంగ్లాదేశ్, ఇండోనేషియా, థారులాండ్‌లకు మిర్చి ఎగుమతులు అత్యధికంగా జరుగుతాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారతదేశం నుండి 1.79 లక్షల టన్నుల మిర్చిని చైనా దిగుమతి చేసుకుంది. వీటి విలువ 4,123 కోట్ల రూపాయలు! అయితే, అమెరికాతో అంటకాగే విధానాల్లో భాగంగా చైనాతో పాటు పలు ఇతర దేశాలకు చేసే ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం అనేక ఆంక్షలు పెట్టింది. ఫలితంగా ఎగుమతుల మార్కెట్ భారీ స్థాయిలో క్షీణించి, నిల్వలు పేరుకుపోయాయి. రైతాంగం ఆందోళన నేపథ్యంలో చైనాతో ఆర్డర్లను పునరుద్ధరించడానికి రాష్ట్ర మార్కెటింగ్ అధికారులు ప్రయత్నించినప్పటికీ కేంద్రం నుండి సానుకూల స్పందన రాలేదని చెబుతున్నారు.

# ఎమ్మెల్యే కోటాపై ఊగిసలాట! ఫిరాయింపు దారులలో హైటెన్షన్

హైదరాబాద్,ఎమ్మెల్యే కోటాలోని అయిదు ఎమ్మెల్సీ స్థానాలకు మార్చిలో ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే దీనికి సంబంధించిన షెడ్యూల్ విడుదల అయ్యింది. ఎన్నడూ లేని విధంగా ఈసారి జరిగే ఎన్నికల్లో అన్ని పార్టీల్లో ఉత్కంఠ నెలకొంది. ప్రధానంగా పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల్లో టెన్షన్ పెరిగింది. ప్రస్తుతం ఏర్పడిన ఖాళీల్లో మూడు కాంగ్రెస్ ఖాతాలోకి, ఒకటి బీఆర్ఎస్ ఖాతాలోకి వెళ్లే అవకాశం ఉంది. అయితే.. మిగిలిన ఒక్క సీటు కోసం మాత్రమే పోటీ అనివార్యంగా ఉ ఒడనుంది. ఇక.. ఆ సీటు దక్కించుకోవడానికి కాంగ్రెస్ తీవ్ర యత్నం చేస్తోంది. ఫిరాయింపుదారులు, ఎంఐఎం మద్దతు తీసుకుంటే ఆ సీటు కాంగ్రెస్ ఖాతాలోకి వెళ్లే చాన్స్ ఉంది. బీఆర్ఎస్ విప్ జారీ చేసినా ఫిరాయింపుదారులు కాంగ్రెస్‌కు మద్దతిస్తే పదవి పోవడం ఖాయమని పరిశీలకులు అంటున్నారు. ఒకవేళ కాంగ్రెస్‌తో జతకట్టి ఉన్నప్పటికీ ఎంఐఎం కోరితే కాంగ్రెస్ ఒక సీటు జార విడుచుకోవాలి. బీజేపీ విషయానికి వస్తే.. వారికి ఉన్న బలం మేరకు పోటీ చేసే అవకాశం లేదు. అయితే.. ఎవరికో ఒకరికి మద్దతివ్వాలి. కేంద్రంలో విపక్ష పార్టీగా ఉన్న కాంగ్రెస్‌కు మద్దతిచ్చే అవకాశం లేదు. ఒకవేళ ఇస్తే బీఆర్ఎస్ ఆరోపించినట్లు రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డితో అంటకాగుతున్నారన్న ఆరోపణలు నిజమవుతాయి. బీఆర్ఎస్‌కు మద్దతిస్తే పెద్దగా రాజకీయ విమర్శలు ఎదుర్కో అవసరం లేదు. ఎందుకంటే ప్రాంతీయపార్టీలతో అంటకాగుతున్న బీజేపీ అందుకు వ్యతిరేకం కాదని నిరూపించుకునే అవకాశం ఉంది.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇదీ లెక్క..

అసెంబ్లీలో ఉన్న ఎమ్మెల్సీ స్థానాలకు మార్చిలో నోటిఫికేషన్ రానున్నది. అసెంబ్లీలో 119 స్థానాలున్నాయి. ఇందులో కాంగ్రెస్‌కు 64 మంది ఎమ్మెల్యేలుండగా, కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య మృతి కారణంగా జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం సాధించింది. దీంతో కాంగ్రెస్ బలం 65కి చేరింది. అలాగే.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య 39 ఉండగా.. ఎమ్మెల్యే లాస్య మృతితో జరిగిన ఉప ఎన్నికల్లో ఆ సీటు కోల్పోవడంతో ప్రస్తుతం బీఆర్ఎస్ సంఖ్య 38కి చేరింది. ఇందులో 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో ప్రస్తుతం బీఆర్ఎస్‌కు 28 మంది ఎమ్మెల్యేల బలం ఉన్నట్లు లెక్క. అలాగే ఎంఐఎంకి ఏడుగురు ఎమ్మెల్యేలు, బీజేపీకి ఎనిమిది మంది ఎమ్మెల్యేలున్నారు. ఇక.. ఒక ఎమ్మెల్సీ స్థానం దక్కించుకోవడం కోసం 20 మంది ఎమ్మెల్యేల బలం ఉండాలి. కాంగ్రెస్ సునాయాసంగా మూడు సీట్లు దక్కించుకుంటుంది. అలాగే బీఆర్ఎస్ కూడా ఒక సీటు దక్కించుకుంటుంది. మిగిలిన ఒక్క సీటు కోసం పోటీ పడాల్సి ఉంటుంది. అయితే.. కాంగ్రెస్‌కు మిగిలింది ఐదుగురు, ఫిరాయింపుదారులు పది మంది, బీఆర్ఎస్‌కు ఎనిమిది మంది, బీజేపీకి ఎనిమిది మంది, ఎంఐఎంకి ఏడుగురు ఉన్నారు. ఒక్కవేళ కాంగ్రెస్ ఆ ఒక్క సీటు దక్కించుకోవాలంటే కాంగ్రెస్, ఫిరాయింపుదారులు, ఎంఐఎం కలిస్తే ఆ సీటు కాంగ్రెస్ ఖాతాలోకి వెళుతుంది. ఒకవేళ ఎంఐఎం కూడా ఎమ్మెల్సీ స్థానం కోరితే కాంగ్రెస్ ఒక ఎమ్మెల్సీ పదవి కోల్పోవలసి ఉ ంటుంది.

బీఆర్ఎస్ ఎత్తుగడ ఏమిటో?




ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎత్తుగడ ఏంటన్నది తెలియడం లేదు. ఈ విషయంపైనే అంతా చర్చించుకుంటున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించే కంటే ఫిరాయింపుదారులపై వేటు వేయడానికి వినియోగించుకునే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. ఇప్పటికే పార్టీ ఫిరాయించిన పది మంది పదవులను ఊడగొట్టడమే ధ్యేయంగా బీఆర్ఎస్ ముందుకు వెళుతుంది. ఇందులో భాగంగా న్యాయపోరాటం కూడా చేస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికలు కూడా ఓ మంచి వేదికగా తీసుకుని ఆ పది మంది ఎమ్మెల్యేల పదవులు ఊడగొట్టడానికే ప్రయత్నం చేసే అవకాశాలు ఎక్కువగా ఉ న్నాయనిపలువురు భావిస్తున్నారు. బీఆర్ఎస్ విప్ జారీ చేస్తే ఫిరాయింపుదారులు చిక్కుల్లో పడే అవకాశం ఉంది.

పది మంది ఎమ్మెల్యేల్లో టెన్షన్..

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పది మంది ఎమ్మెల్యేల్లో టెన్షన్ పట్టుకుంది. ఇప్పటికే బీఆర్ఎస్ ఫిరాయింపుదారులపై అవిశ్రాంతి పోరాటం చేస్తోంది. ఈ కేసు సుప్రీంకోర్టు వరకూ వెళ్లింది. ప్రస్తుతం విచారణలో ఉంది. అయితే.. ఈ క్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికలు వస్తున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అసెంబ్లీలో విప్ జారీ చేస్తే.. ధిక్కరించేవారికి పదవి పోవడం ఖాయం. ఒక వేళ పదవి పోతే ఉ ప ఎన్నికల్లో నెగ్గుతామో లేదో అనేది అనుమానమే. కాంగ్రెస్ కూడా మండలిలో బలం సంపాదించుకోవడం కోసమే బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను చేర్పించుకుందని పలువురు భావిస్తున్నారు. ఒకవేళ కాంగ్రెస్‌కు అనుకూలంగా ఓటు వేయకపోతే తమ రాజకీయ పరిస్థితి ఏమిటనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా ఉంది. ముందుకు వెళితే నుయ్యి.. వెనక్కు వస్తే గొయ్యి అనే పరిస్థితులో ఆ పది మంది ఎమ్మెల్యేల పరిస్థితి మారిపోయింది.

క్లైమాక్స్‌కు చేరనున్న ఫిరాయింపు కథ..

ఫిరాయింపులదారుల కథ క్లైమెక్స్‌కు చేరనుందని అంతా భావిస్తున్నారు. ఇప్పటికే ప్రజాక్షేత్రంలో ఈ పది మంది ఎమ్మెల్యేల కోసం ఎండగడుతున్న బీఆర్ఎస్, మరో వైపు న్యాయపోరాటం చేస్తోంది. ఈ క్రమంలో ఎమ్మెల్యే కోట ఎమ్మెల్సీ ఎన్నికలు రావడంతో బీఆర్ఎస్ విప్ జారీ చేయడం ఖాయం. ఇలాంటి సమయంలో విప్ ధిక్కరించిన ఎమ్మెల్యేలపై వేటు పడుతుంది. మూడు రకాల పోరాటాలతో బీఆర్ఎస్ ముందుకు వెళితే ఫిరాయింపుదారుల కథ క్లైమాక్స్ చేరుతుందని అనలిస్టులు అంచనా వేస్తున్నారు.

# విద్వేష ప్రసంగాలతో విషప్రచారం



హైదరాబాద్,కుల, మత తేడాలకతీతంగా స్నేహం, సౌభ్రాతృత్వం విరాజిల్లిన నేల భారతదేశం. అయితే పాలక పార్టీ బిజెపి ద్వేషపూరిత ప్రసంగాలు ఈ ఐక్యతను విచ్ఛిన్నం చేస్తూ దేశ వాతావరణాన్ని విషతుల్యంగా మారుస్తున్నాయి. ఇండియా హేట్ ల్యాబ్ (ఐహెచ్‌ఎల్) తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం, 2024లో ఈ ధోరణి మరింత విస్తరించింది. ఏప్రిల్ నుంచి జూన్ మధ్య జరిగిన సార్వత్రిక ఎన్నికలు, ఆపై మహారాష్ట్ర, జార?ండ్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి నాయకుల ద్వేషపూరిత ప్రసంగాలు విస్తరించాయి. ఈ నివేదిక కేవలం సంఖ్యలను మాత్రమే వెల్లడించకుండా, ఈ ప్రసంగాల వెనుక ఉన్న వ్యూహాలను, కీలక పాత్రధారులను, వాటి సైద్ధాంతిక ప్రేరణలను కూడా బహిర్గతం చేసింది. 2024 నివేదిక ప్రకారం, ద్వేష ప్రచారంలో బిజెపి, దాని అనుబంధ సంస్థలు ప్రత్యక్షంగా ముడిపడ్డాయి. గత ఎన్నికల్లో ఫ్రింజ్ సంఘాలు మాత్రమే విద్వేష ప్రసంగాలు చేసేవి. కానీ ఈసారి రాష్ట్ర, కేంద్ర స్థాయి నాయకులు స్వయంగా ఈ విష ప్రచారాన్ని నడిపారు. ప్రధాని నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ సిఎం యోగి ఆదిత్యనాథ్ చేసిన ద్వేషపూరిత ప్రసంగాలను దేశమంతా గమనించింది. దీనివల్ల బిజెపి దేశంలోనే అతి పెద్ద విద్వేష ప్రసంగం ప్రచారకారులుగా మారింది. బిజెపి నాయకులు హాజరైన 340 సమావేశాల్లో 29.2 శాతం విద్వేష ప్రసంగాలు జరిగినట్లు నివేదిక వెల్లడించింది. ఇది గతేడాదితో పోలిస్తే పెరిగింది. అయినప్పటికీ, బిజెపి కేవలం 50 సంఘటనలకే బాధ్యత వహించింది. సార్వత్రిక ఎన్నికల సమయంలో బిజెపి చేసిన ద్వేష ప్రసంగాలు మొత్తం 76.7 శాతంగా నమోదు అయ్యాయి. కేవలం బిజెపి మాత్రమేకాదు, విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పి), బజరంగ్ దళ్ వంటి హిందూత్వ సంస్థలు కూడా విద్వేష ప్రచారాన్ని మరింత పెంచాయి. వీరు పాల్గొన్న 279 కార్యక్రమాల్లో ద్వేషప్రసంగాలు చోటుచేసుకున్నాయి. మహారాష్ట్రలోని సకల్ హిందూ సమాజ్ 56 ద్వేష ప్రసంగాలను నిర్వహించింది. సురేష్ చవాంకే, కాజల్ హిందుస్తానీ, బిజెపి ఎంఎల్‌ఎ టి. రాజాసింగ్, నితీష్ రాణే వంటి మతతత్వవాదులు ఈ ప్రచారంలో కీలకంగా వ్యవహరించారు. 2024 ఏప్రిల్ 21న రాజస్థాన్ బన్స్వారాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ముస్లింలను చొరబాటుదారులుగా అభివర్ణిస్తూ, వారు హిందువుల సంపదను దోచుకుంటున్నారని ప్రధాని మోడీ చేసిన ప్రసంగం తీవ్ర ప్రభావం చూపించింది. ఎన్నికల సమయంలో మొత్తం 373 ద్వేషపూరిత ప్రసంగాల ఘటనలు నమోదయ్యాయి. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, జార?ండ్ రాష్ట్రాలు దీని వల్ల అత్యధికంగా ప్రభావితమయ్యాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఒక్కరే 58 ద్వేషపూరిత ప్రసంగాలు చేశారు. 'ఓట్ జిహాద్', 'ల్యాండ్ జిహాద్' వంటి భయపెట్టే పదాలను పదేపదే ప్రస్తావించారు. యోగి ఆదిత్యనాథ్ 86 ద్వేష ప్రసంగాలు చేశారు. అంటే ప్రతి నాలుగు రోజులకు ఒకటి చొప్పున విద్వేష ప్రచారం జరిగింది. ఈ ప్రసంగాల్లో ప్రధానంగా ముస్లింలు, క్రైస్తవులు లక్ష్యంగా మారారు. బిజెపి ఎన్నికల వ్యూహం పూర్తిగా మత భయాన్ని రెచ్చగొట్టడంపైనే ఆధారపడింది. ప్రధాని మోడీ, అమిత్ షా, యోగి ఆదిత్యనాథ్ లాంటి నాయకులు 'హిందువుల ఆస్తులను బంగ్లాదేశ్ చొరబాటుదారులకు, రోహింగ్యా శరణార్థులకు విరాళంగా ఇస్తారు' అంటూ ప్రతిపక్షాలను దుష్ప్రచారం చేశారు. ఈ ప్రసంగాల ప్రభావంగా మత అల్లర్లు, మూకదాడులు, వ్యవస్థాగత వివక్ష పెరిగాయి.

సోషల్ మీడియా పాత్ర

2024లో ద్వేష ప్రసంగాలు కేవలం బహిరంగ సభలకే పరిమితం కాలేదు. సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా వ్యాప్తి చెందాయి. కొన్ని సెకన్ల వ్యవధిలోనే లక్షలాది మందికి చేరాయి. ఐహెచ్‌ఎల్ నివేదిక ప్రకారం, 995 ద్వేషపూరిత వీడియోలు ఫేస్‌బుక్, యూ ట్యూబ్, వాట్సాప్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ట్రాక్ చేయబడ్డాయి. ఒక్క ఫేస్‌బుక్‌లోనే 495 వీడియోలు హోస్ట్ చేయబడ్డాయి. 211 వీడియోలు యూట్యూబ్‌లో కనిపించాయి. బిజెపి నాయకుల 266 మైనారిటీ వ్యతిరేక ద్వేష ప్రసంగాలు బహుళ వేదికలలో ప్రత్యక్ష ప్రసారం అయ్యాయి. మొత్తం 1,165 ద్వేష ప్రసంగాల ఘటనల్లో 1,147 ముస్లింలను లక్ష్యంగా చేసుకున్నట్లు నివేదిక పేర్కొంది. ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి యోగి, ఇతర బిజెపి నాయకులు ద్వేషపూరిత కథనాలను ఎన్నికల ప్రచారంలో ప్రోత్సహించారు. ముస్లింలపై ప్రత్యక్ష హింసకు పిలుపునిచ్చిన 259 ప్రసంగాలు నమోదయ్యాయి. ముస్లిం వ్యాపారాలను బహిష్కరించాలని కోరుతూ 111 ప్రసంగాలు, మసీదులు, ముస్లిం ఇళ్లను ధ్వంసం చేయాలని కోరుతూ 274 ప్రసంగాలు, ముస్లింలపై ఆయుధాలు పట్టుకోవాలని కోరుతూ 123 ప్రసంగాలు జరిగాయని నివేదిక వెల్లడించింది. ఉత్తరాఖండ్‌లో విశ్వహిందూ పరిషత్ నిర్వహించిన ఆయుధ పూజ కార్యక్రమంలో ఒక వక్త 'హిందువులు కాని వారిని చంపడం మోక్షానికి దారి తీస్తుంది' అని బహిరంగంగా ప్రకటించాడు. గతేడాది ద్వేష ప్రసంగాలు ముస్లింలను మాత్రమే లక్ష్యం గా చేయలేదు. క్రైస్తవ వ్యతిరేకత కూడా పెరిగింది. 115 ద్వేష ప్రసంగాలు క్రైస్తవులను లక్ష్యంగా చేసుకున్నవిగా నమోదు అయ్యాయి. 2024 మార్చిలో అసోంలోని హిందూ జాతీయవాద సంస్థలు క్రైస్తవ పాఠశాలలపై దాడులకు పిలుపునిచ్చాయి. ఉత్తరప్రదేశ్‌లో రాష్ట్రీయ బజరంగ్ దళ్ నాయకులు కాథలిక్ పాఠశాలలపై దాడులు చేయాలని కోరారు. ఈ ద్వేష ప్రచారాల ప్రభావంగా మూకదాడులు, బలవంతపు పునఃమార్పిడి ఘటనలు పెరిగాయి. ఇండియా హేట్ ల్యాబ్ 2024 నివేదిక ఓ భయంకరమైన వాస్తవాన్ని వెల్లడిస్తోంది. ద్వేష ప్రసంగాలు ఉద్దేశపూర్వక రాజకీయ ప్రాజెక్టుగా మారాయి. ముస్లింలను, క్రైస్తవులను అణగదొక్కేందుకు, భారత ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసేందుకు రూపొందించబడ్డాయి. ఈ ద్వేష ప్రచారం ప్రభావాలు రాబోయే సంవత్సరాల్లో మరింత పెరిగే ప్రమాదం ఉ ందని నివేదిక హెచ్చరించింది.

# కొమరవోలు గ్రామస్థులతో బాలయ్య దురుసు ప్రవర్తన

విజయవాడ,కృష్ణా జిల్లాలోని తన స్వగ్రామం నిమ్మకూరులో సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా కొమరవోలు గ్రామస్థులు బాలకృష్ణతో ఫొటోలు దిగేందుకు ఎగబడగా.. వారిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమయంలోనే ' మా గ్రామాన్ని పట్టించుకోరా' అని ఆ గ్రామస్తులు ప్రశ్నించగా.. దీనిపై బాలకృష్ణ మాట్లాడుతూ.. పట్టించుకోను.. ఫోటోలు దిగారుగా.. ఇక వెళ్ళండి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొమరవోలు గ్రామమా అదెక్కడ అని వ్యంగంగా మాట్లాడారు. కొమరవోలు గ్రామానికి ఈ జన్మలో రాను. వాళ్లు లింగాయత్తులు.. వాళ్లను పట్టించుకోవాల్సిన అవసరం లేదు అని వ్యంగాస్త్రాలు సందించారు. అయితే, బాలకృష్ణ మాతృమూర్తి బసవతారకం స్వగ్రామం కొమరవోలు గ్రామమే. తన కన్నతల్లి స్వగ్రామస్తులపైనే బాలకృష్ణ మండిపడడం హాట్ టాపిక్ అయింది.

# మరోమారు వక్రబుద్ధి చూపించుకున్న పాకిస్థాన్

న్యూఢిల్లీ,అంతర్జాతీయ వేదికలపై తరచూ పాకిస్థాన్ భారత్‌పై తన అక్కసు వెళ్లగక్కుతున్న పాకిస్థాన్‌కు మరోమారు భారత్ ధీటుగా బదులిచ్చింది. నోరు మూసుకునేలా చేసింది. దాని కుత్సిత బుద్ధిని బయటపెట్టింది. తాజాగా జమ్మూకశ్మీర్‌లో ప్రజాస్వామ్యం అణచివేతకు గురవుతోందని, మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలిలో దాయాది దేశం ఆరోపించింది. ఈ ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. అంతేకాక.. మాకు ఉపన్యాసాలు ఇచ్చే స్థాయిలో ఆ దేశం లేదని స్పష్టం చేసింది జెనీవాలో జరిగిన ఈ సమావేశంలో జమ్మూకశ్మీర్‌ను ఉద్దేశించి పాక్ న్యాయ, మానవ హక్కుల మంత్రి అజం నజీర్ తరార్ వ్యాఖ్యలు చేశారు. దీనిపై భారత రాయబారి క్షితిజ్ త్యాగి దీటుగా స్పందించారు. 'కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లు ఎప్పుడూ భారత్‌లో అంతర్భాగమే. దశాబ్దాల తరబడి పాకిస్థాన్ ఉగ్రవాదం కారణంగా దెబ్బతిన్న ఆ ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. మానవ హక్కుల ఉల్లంఘన, మైనారిటీలను హింసించడంతో సహా ప్రజాస్వామ్య విలువలను పాటించని దాయాది దేశం భారత్‌కు ఉపన్యాసాలు ఇచ్చే స్థాయిలో లేదు. ఆ దేశ వాక్‌చాతుర్యంలోనే కపటత్వం కన్పిస్తోంది. ఐరాస జాబితాలోని పలు ఉగ్రవాద సంస్థలకు ఆ దేశం ఆశ్రయం కల్పిస్తుంది. ప్రజాస్వామ్య పురోగతి, ప్రజలకు గౌరవం కల్పించడం వంటి వాటిపై భారత్ దృష్టిసారిస్తుంది. ఆ దేశం మాపై ఆరోపణలు చేయడం మానేసి.. తమ దేశంలోని ప్రజలకు సుపరిపాలనను అందించడంపై దృష్టిపెట్టాలి' అని త్యాగి పేర్కొన్నారు. ఇక, ఇటీవల చైనా అధ్యక్షతన జరిగిన భద్రతామండలి సమావేశంలోనూ పాకిస్థాన్ విదేశాంగ మంత్రి మహమ్మద్ ఇషక్ దార్ జమ్మూకశ్మీర్ అంశాన్ని లేవనెత్తారు. దీనికి సైతం భారత్ ఘాటుగా స్పందించింది. జైషే మహమ్మద్ వంటి సంస్థలను ప్రోత్సహించే పాక్.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామని చెప్పడం అత్యంత హాస్యాస్పదమని ఆగ్రహం వ్యక్తంచేసింది. ముందుగా దీనిని సరిదిద్దుకోవాలని సూచించింది.

# మళ్లీ లిక్కర్ ఉచ్చు

న్యూఢిల్లీ,ఢిల్లీ లిక్కర్ స్కాంలో తీగలాగితే డొంక కదులుతోంది. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా అసెంబ్లీ వేదికగా కాగ్ రిపోర్ట్ ను బయటపెట్టారు. ఢిల్లీలో బిజెపి ప్రభుత్వం అధికారంలో రాగానే తొలి అసెంబ్లీ సమావేశాల్లోనే కాగ్ రిపోర్ట్ బయటపెట్టడంతో లిక్కర్ స్కాం మరో మారు చర్చకు దారి తీసింది. ఈ స్కాంలో చిక్కుక్కున్నఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ , మాజీ డిప్యూటి సిఎం మనీష్ సిసోడియా ఇప్పటికే బెయిల్ పై విడుదలైన సంగతి తెలిసిందే. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కెసీఆర్ కూతురు కవిత ఈ లిక్కర్ స్కాంలో కింగ్ పిన్ . సౌత్ గ్రూప్ కు చెందిన కవిత అప్పటి ఆప్ ప్రభుత్వాన్ని ప్రభావితం చేశారు. ఇటీవల జరిగిన ఢిల్లీ ఎన్నికల్లో ఆప్ ఓడిపోవడానికి లిక్కర్ స్కాం ప్రధాన కారణం. ఢిల్లీ లిక్కర్ పాలసీపై 166 పేజీల కాగ్ రిపోర్ట్ లో రెండువేల కోట్ల స్కాం జరిగినట్టు ముఖ్యమంత్రి రేఖా గుప్తా వెల్లడించారు. నవంబర్ 2021 నుంచి సెప్టెంబర్ 2022 వరకు ఢిల్లీలో నూతన మద్యం విధానం కొనసాగింది. ఈ స్కాం వెలుగులోకి రావడంతో ఢిల్లీ లిక్కర్ పాలసీ రద్దయ్యింది. అప్పటి నుంచి తెలంగాణ పాలిటిక్స్ హీటెక్కాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో లిక్కర్ స్కాం ప్రచార అంశంగా మారిపోయింది.

తెలంగాణలో వరుసగా మూడోసారి అధికారంలో రావాలనుకున్న బిఆర్ఎస్ కుప్పకూలడానికి లిక్కర్ స్కాం ముఖ్య భూమిక వహించింది. బిజెపి, బిఆర్ఎస్ దోస్తీ బలపడటానికి లిక్కర్ స్కాం ఓ టూల్ మాదిరిగా మారిపోయింది. ఎన్నికల ఫలితాల్లో బిఆర్ఎస్ ఓడిపోవటంతో బిజెపి కూడా దూరమైంది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి బిఆర్ ఎస్ కు తగిన సంఖ్యాబలం కూడా లేదు. 10 మంది బిఆర్ ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అధికారానికి పదేళ్లు దూరంగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి కవిత లిక్కర్ స్కాం రాజకీయ మైలేజీ ఇచ్చింది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడానికి లిక్కర్ స్కాం ఓ కారణమనే చెప్పాలి. లిక్కర్ స్కాంలో ఇరుక్కున్న కవితను రిలీజ్ చేయడానికి బిజెపి కవితకు సపోర్ట్ చేయలేదు. బిఆర్ ఎస్ రాజకీయంగా దెబ్బతినడమే కారణమైంది. . అదే సమయంలో బిజెపి కూడా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మంచి మెజారిటీతో తెలంగాణలో ప్రభుత్వం ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తోంది. పర్యవసనాంగా కవిత తీహార్ జైల్లో ఊచలు లెక్కపెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. కవితకు బెయిల్ లభించకపోవడంతో బిఆర్ఎస్ ను బిజెపి లో విలీనం దిశగా చర్చలు జరిగాయి. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటీఆర్ విలీన ప్రతిపాదనను ఆమోదం పలికినప్పటికీ బిఆర్ ఎస్ వ్యవస్థాపకులు కెసీఆర్ మాత్రం వెనకడుగు వేయడంతో కవిత జైల్లో పర్మినెంట్ ఖైదీ అని ప్రచారం జరిగింది. ఎట్టకేలకు కోర్టు బెయిల్ ఇవ్వడంతో కవిత బయటకొచ్చారు. గత దసరాకు ముందే ఆమె ఇంటికి వచ్చినప్పటికీ బతకమ్మ వేడుకలకు బ్రాండ్ అంబాసిడర్ అయిన కవిత గైనకాలజీ సమస్యలతో ఇంటికే పరిమితమయ్యారు. తీహార్ జైలు నుంచి విడుదలయ్యాక కవిత క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. కార్ రేస్ స్కాంలో అన్న కెటీఆర్ అరెస్ట్ తప్పదని ప్రచారం జరగడంతో కవిత మళ్లీ యాక్టివ్ అయ్యారు. రేవంత్ సర్కార్ పై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేస్తూ వచ్చారు. కవిత ఆరోపణలతో బిజెపి బిఆర్ఎస్ బంధం మళ్లీ బలపడిందనే ప్రచారం జరుగుతోంది. తెలంగాణ ఎంఎల్ సి ఎన్నికల్లో బిజెపి లాభపడే విధంగా బిఆర్ ఎస్ పావులు కదిపింది. కాంగ్రెస్ ను మట్టికరి పించడానికి బిఆర్ఎస్ కీలకమైన ఎంఎల్ సి ఎన్నికల్లో పోటీ చేయడం లేదు. బిఆర్ఎస్ తటస్థం కావడంతో బిజెపి రాజకీయ ప్రయోజాలు మరింత బలపడ్డా యి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి లాభపడే విధంగా బిఆర్ఎస్ పావులు కదుపుతోంది. ఢిల్లీ బిజెపి బిఆర్ఎస్ ను శత్రువుగా పరిగణిస్తే కేంద్ర నాయకత్వం మాత్రం చూసి చూడనట్టు వ్యవహరిస్తుందని అర్థం చేసుకోవాలి. కవితను అడ్డు పెట్టుకుని బిజెపి తన రాజకీయ ప్రయోజనాలను కాపాడుకుంటోంది.

# భవన నిర్మాణాలకు మార్గదర్శకాలు జారీ

అమరావతి,రాష్ట్రంలో అనధికార, అక్రమ నిర్మాణాలకు సంబంధించి పురపాలకశాఖ మార్గదర్శకాలను విడుదల చేసింది. అన్ని రాష్ట్రాలకు ఇటీవల సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలతో తాజా మార్గదర్శకాలు జారీ అయ్యాయి. ఈమేరకు పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్ గురువారం ఉ త్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆక్యుపేషన్ సర్టిఫికెట్‌పై భవన యజమానుల వద్ద అండర్ టేకింగ్ తీసుకోవాల్సి ఉంటుంది. ఆక్యుపేషన్ సర్టిఫికెట్ ఉంటేనే భవనాల్లోకి వచ్చేలా చూడాలి. నిర్మాణం పూర్తయ్యే వరకు ప్లాన్ ప్రదర్శించేలా చర్యలు చేపట్టాలి. ఎప్పటికప్పుడు అధికారులు బిల్డింగ్ ప్లాన్, నిర్మాణాన్ని తనిఖీ చేయాలి. డీవియేషన్ సరిచేసే వరకు ఆక్యుపేషన్ సర్టిఫికెట్ ఇవ్వొద్దు. డీవియేషన్ ఉన్న నిర్మాణాలకు ఆక్యుపేషన్ సర్టిఫికెట్ ఇస్తే చర్యలు తప్పవు. నివాసయోగ్య ధ్రువపత్రం ఇస్తేనే తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలి. అక్రమ నిర్మాణాలకు ట్రేడ్, బిజినెస్ లైసెన్సులు జారీ చేయొద్దని స్పష్టం చేశారు. జోనల్ ప్లాన్‌లోనూ డీవియేషన్ లేకుండా నిర్మాణాలు ఉండేలా చూడాలి. నివాసయోగ్య పత్రం చూశాకే బ్యాంకులు నిర్మాణాలపై రుణాలు ఇవ్వాలని నిర్దేశించారు.

# మరో వివాదంలో ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్

న్యూఢిల్లీ,ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ ఇటీవల మరోసారి వార్తల్లో నిలిచింది. ఈ కంపెనీకి చెందిన మైసూరు క్యాంపస్‌లో దాదాపు 400 మంది ట్రైనీ ఉద్యోగులను విధుల్లో నుంచి తొలగించడం తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై కార్మిక యూనియన్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. తాజాగా ఈ వ్యవహారం ప్రధానమంత్రి కార్యాలయానికి చేరింది. ఈ బలవంతపు లేఆఫ్‌ల పై ట్రైనీలు పీఎంఓకు ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. తొలగింపులపై ప్రధానమంత్రి కార్యాలయం లో 100కు పైగా ఫిర్యాదులు వచ్చినట్లు కథనాలు తెలిపాయి. ఈ విషయంలో జోక్యం చేసుకుని తమ ఉద్యోగాలను తిరిగి ఇప్పించాలని, భవిష్యత్తులో ఇలాంటి తొలగింపులు జరగకుండా చూడాలని ట్రైనీలు కోరినట్లు తెలుస్తోంది. దీంతో కేంద్ర కార్మిక శాఖ స్పందించి చర్యలు చేపట్టినట్లు సమాచారం. దీనికి సంబంధించి కర్ణాటక కార్మిక శాఖకు ఫిబ్రవరి 25నే నోటీసులు పంపించినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ వ్యవహారంపై రాష్ట్ర కార్మిక శాఖ అధికారులు దర్యాప్తు జరిపి కేంద్రానికి నివేదిక ఇవ్వాలని సూచించినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి ఆరంభంలో మైసూరు క్యాంపస్‌లోని దాదాపు 400 మంది ట్రైనీలకు ఇన్ఫోసిస్ లేఆఫ్‌లు ప్రకటించింది. ఉన్నపళాన క్యాంపస్‌ను వీడాలని అల్టిమేటం జారీ చేసినట్లు వార్తలు వచ్చాయి. దీనిపై ఇన్ఫోసిస్ ఆ తర్వాత స్పందించింది. వరుసగా మూడు ఎవాల్యుయేషన్ పరీక్షల్లో విఫలమవడంతో వారిని తొలగించినట్లు వెల్లడించింది. ఈ పరీక్షలు సంస్థ నిబంధనల్లో భాగమేనని, కంపెనీ పురోగతికి కూడా ముఖ్యమని పేర్కొంది. 2022–23 నియామక ప్రక్రియలో భాగంగా 2000 మంది ఫ్రెషర్లను ఇన్ఫోసిస్ ఎంపిక చేసింది. సిస్టమ్ ఇంజినీర్, డిజిటల్ స్పెషలిస్ట్ ఇంజినీర్ తదితర పోస్టులకు ఎంపిక చేస్తూ, వారికి అదే ఏడాది ఆఫర్ లెటర్లు ఇచ్చింది. వారంతా 2022 బ్యాచ్ ఉత్తీర్ణులు. అన్ని రకాల పరీక్షలను పూర్తి చేసినా వీరిని విధుల్లోకి తీసుకోవడంలో మాత్రం ఆలస్యం చేస్తూ వచ్చారు. దీంతో కంపెనీపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో పాటు కార్మిక శాఖ వద్ద ఫిర్యాదు సైతం నమోదైంది. ఈ క్రమంలో రెండేళ్ల ఆలస్యంగా 2024 ఏప్రిల్‌లో వారిని ఉద్యోగాల్లోకి తీసుకుంది. అయితే, గతేడాది మైసూరు క్యాంపస్‌లో ట్రైనీలుగా చేరిన వారిలో సగం మందిపై ఇన్ఫోసిస్ వేటు వేయడం గమనార్హం.

# పవన్ చేయాల్సింది అదేనా ?

విజయవాడ:జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జగన్ ని విమర్శిస్తూ పోతున్నారు. ఆయన మీడియా ముందు కానీ నిండు అసెంబ్లీలో కానీ జగన్ మీదనే హాట్ కామెంట్స్ చేస్తున్నారు. అయితే ఆయన మాటలు ఇస్తున్న ప్రకటనలు ఎంతవరకూ జనంలోకి వెళ్తున్నాయి, ఎంతవరకూ అంగీకారంగా ఉంటున్నాయన్నది చూడాలని అంటున్నారు.వైసీపీ అధినేత మీద విమర్శలు చేయడం వల్ల ఒరిగేది ఏముంది అన్నది ప్రస్తుతం చర్చగా ఉంది. ఆయనని దారుణంగా ఓడించి జనాలు పక్కన పెట్టేశారు. అదే సమయంలో వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు. దాంతో ఆ పార్టీ తన రాజకీయ విధానాలు ఏమిటో ఎలా సాగాలో అలా సాగుతోంది. దాని వల్ల వచ్చే పర్యవసానాలు కూడా ఎదుర్కోవడం ఆ పార్టీకే ఉంటుంది.అయితే జనసేన అధినేత కంటే ఇపుడు పవన్ ఉప ముఖ్యమంత్రిగా అధికారంలో ఉన్న నాయకుడిగా జగన్ మీద విమర్శలు చేయడం ఎంతవరకూ సబబు అని అంటున్నారు. గవర్నర్ మీద గౌరవం లేదు అని అల్లరి చేశారు అని ఆయన చెప్పే మాటలలో సహేతుకత లేదని అంటున్నారు. గతంలో విభజన ఏపీలో వైసీపీ ఏలుబడిలో టీడీపీ అలాగే చేసింది. ఉమ్మడి ఏపీలో అలాగే చేశారు. గవర్నర్ వేరు, ఆయనకు ఇచ్చే గౌరవం వేరు. కానీ ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చదివేది ప్రభుత్వం ఇచ్చే నివేదికను. దాని మీదనే ఏ విపక్షం అయినా విమర్శలు చేస్తుంది. ఈ రెండింటికీ ముడి పెట్టడం పవన్ కి తగదని అంటున్నారు.ఈ సంగతి ఇలా ఉంచితే పవన్ తొమ్మిది నెలల తమ ప్రభుత్వం మీద ప్రశంసలు కురిపిస్తున్నారు. అయితే తప్పులు లేవా అన్నది కూడా ప్రశ్నలుగా వస్తున్నాయి. ఇటీవల జరిగిన గ్రూప్ టూ అభ్యర్థులకు జరిగిన అన్యాయం విషయంలో ఆయన ఇదేమని అడిగారా అన్న చర్చ ఉంది. అలాగే మిర్చీ రైతుల ఆందోళనలను ఆయన కాస్తా పట్టించుకుని యార్డుకు వెళ్ళి పరామర్శించినా బాగుండేది అన్న మాట ఉంది.పవన్ అంటేనే ఒక నిలువెత్తు ప్రశ్న. ఆయనలోని ఆవేశాన్ని ప్రశ్నించే తత్వాన్ని చూసే అంతా ఆకర్షితులయ్యారు. అటువంటి పవన్ జనసేన అధినేతగా ఏమి అన్నా సరిపోతుంది. కానీ బాధ్యత కలిగిన ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా ఆయన మాట్లాడిన ప్రతీ మాటా కౌంట్ అవుతుంది. జనాలు చూసేది కూటమి ప్రభుత్వాన్ని తప్ప జగన్ ని కానే కాదు. ఆయన అసెంబ్లీకే రాకపోవడం ద్వారా తన మీద ఫోకస్ ని కూడా లేకుండా చేసుకున్నారు.ఈ నేపథ్యంలో సభలో లేని ఆయనని నిందించి అనవసరంగా ప్రచారం చేసే బదులు ప్రజా సమస్యల మీద మాట్లాడవచ్చు. అలాగే ప్రభుత్వం కొన్ని చేసింది ఇంకా చేయాల్సి ఉంది వాటి మీద చెప్పవచ్చు. కానీ చిత్రంగా పవన్ ఎన్డీయే ప్రభుత్వం మూడు టెర్ములు ఉంటుంది సుదీర్ఘకాలం బాబే సీఎం అని రాజకీయ ప్రకటనలు నిండు సభలో చేయడం ఎంత వరకూ సబబు అన్న చర్చ వస్తోంది.అయిదేళ్ళకు ఒకమారు తీర్పు ఇచ్చేది ప్రజలు. వారే న్యాయ నిర్ణేతలు. ఇక కూటమి ప్రభుత్వం వచ్చి నిండా ఏడాది కాలేదు. అపుడే మరిన్ని ఎన్నికలు ఎన్డీయే కూటమితోనే అని చెప్పడం అసందర్భమే అవుతుంది అని అంటున్నారు. పైగా పవన్ నుంచే ఈ నినాదం వస్తోంది. బీజేపీ నుంచి కానీ టీడీపీ నుంచి కానీ పెద్దగా రావడం లేదుదాంతో కూటమి ఐక్యత కోసం పవన్ ఇలా అంటున్నారు అన్న సందేశం కన్నా జనసేన రాజకీయంగా తన బలహీనతను చాటుకుంటోందా అన్న అర్థాలు వచ్చేలాగానే అధినేత ప్రకటనలు ఉన్నాయని అంటున్నారు. పొత్తులు ఎన్నికల సమయంలోనే ఉంటాయి. వాటికి ముందు రాజకీయ బేరాలు కూడా ఉంటాయి. అవన్నీ పక్కన పెట్టేసి వన్ సైడ్ గా ఎన్డీయే కూటమితోనే అంటూ దీర్ఘాలు తీస్తే అది జనసేనకు రాజకీయంగా భవిష్యత్తులో నష్టం చేస్తుందని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి.ఇక సనాతన ధర్మం అని పవన్ ప్రవచిస్తున్న తీరు కూడా అత్యధిక జనమోదం పొందడం లేదని అంటున్నారు. ఉప ముఖ్యమంత్రిగా ఆయన తన విధులను సక్రమంగా నిర్వహిస్తూ జనంలో చురుకైన నేతగా ఉండాలని అంతా కోరుకుంటున్నారు. సనాతన ధర్మం అంటూ గుళ్ళూ గోపురాలు తిరగడానికి ఉప ముఖ్యమంత్రి పదవి ఎందుకు అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్న మాటలను కూడా గమనంలోకి తీసుకోవాలని అంటున్నారు. అలాగే ప్రధాని మోడీ హిమాలయాలకు వెళ్తావా అని జోక్ చేశారని పవన్ మీడియాకు చెప్పారు. అయితే దాని వెనక ఆంతర్యం కూడా గ్రహించి ఆయన తీరు మొత్తం మార్చుకోవాలని సూచనలు వస్తున్నాయి.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

న్యూఢిల్లీ, బంగారం ప్రియులకు స్వల్ప ఊరట లభించింది. ఫిబ్రవరి నెల ప్రారంభం నుంచి భారీగా పెరిగాయి. అంతర్జాతీయంగా బంగారం ధరల్లో వృద్ధి చెందటం, ఆర్థిక సంక్షోభం, డాలర్ మారకంలో వచ్చిన మార్పులు లాంటి కారణాలు ఈ ధరల పెరుగుదలకు కారణమయ్యాయి. ఇక ఇప్పుడు గత రెండు రోజులుగా గోల్డ్ రేట్స్.. నేలచూపులు చూస్తున్నాయి. 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారంపై రూ. 280 మేరకు తగ్గగా.. 22 క్యారెట్ల బంగారం రూ. 260 మేరకు తగ్గింది. అటు వెండి ధరలు కూడా బంగారం బాట పట్టాయి. రెండు రోజుల్లో సుమారు రూ. 3100 మేరకు తగ్గింది. అయితే ధరలు పెరిగినప్పుడు ఉన్న దూకుడు తగ్గుదలలో మాత్రం కానరావడం లేదు. దీంతో సామాన్య ప్రజలు బంగారం వైపు చూడడం మానేశారు. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ. 87,810 ఉండగా.. 22 క్యారెట్ల తులం బంగారం రూ. 80,490గా ఉంది. అలాగే విజయవాడలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం రూ. 87,810 ఉండగా.. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ. 80,490 వద్ద కొనసాగుతోంది. వెండి ధరల విషయాని కొస్తే.. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో కేజీ వెండి ధర రూ. 1,05,900గా ఉంది. చెన్నైలో కూడా ఇదే రేటు కొనసాగుతోంది. అటు ముంబై, ఢిల్లీ, కోల్‌కతాలో కిలో వెండి రూ. 97,900గా ఉంది.పేద, సామాన్యులకు బంగారం ధరలు అందుబాటులో లేకుండా పోవడంతో పసిడికి డిమాండ్ పడిపోతోంది. దీంతో దిగుమతులు సగానికి తగ్గనున్నాయని రిపోర్టులు వస్తోన్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో బంగారం దిగుమతులు 15 టన్నులకు పరిమితం కానుందని రాయిటర్స్ ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. ఏడాది క్రితం నాటి దిగుమతులతో పోల్చితే 85 శాతం క్షీణించి.. 20 ఏళ్ల నాటి కనిష్ట స్థాయికి పడిపోవచ్చని అంచనా వేసింది. ఈ ఏడాది జనవరిలోని 30–35 టన్నుల దిగుమతులతో పోల్చితే దాదాపుగా సగానికి క్షీణించొచ్చని విశ్లేషించింది. అంతర్జాతీయ బులియన్ మార్కెట్‌లో సోమవారం ఔన్స్ ధర రికార్డ్ స్థాయిలో 2,956 డాలర్లకు ఎగిసింది. అధిక ధరల కారణంగా డిమాండ్ భారీగా తగ్గింది. అమెరికా వాణిజ్య సుంకాల దాడికి తోడు ప్రపంచ ఆర్థిక అనిశ్చితి, భౌగోళిక ఆందోళనలు బంగారం ధరలకు ఆజ్యం పోస్తున్నాయి. వీటికి తోడు డాలర్‌తో రూపాయి మారకం విలువ భారీగా క్షీణించి పసిడి ధరలను ఎగిసిపడేలా చేస్తోన్నాయి. 2025 జనవరిలో బంగారం దిగుమతులు



30–35 టన్నులకు పడిపోయి.. ఆరు నెలల కనిష్ట స్థాయి వద్ద నమోద య్యాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ప్రస్తుత నెలలో డిమాండ్ మరింత సన్నగిల్లిందని మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు. దేశీయంగా డిమాండ్ తక్కువగా ఉండటం, రికార్డు స్థాయిలో పెరిగిన ధరల కారణంగా ఈ నెలలో బంగారం దిగుమతులు 50 శాతం తగ్గొచ్చన్నారు. దేశంలో వివాహాల సీజన్ కొనసాగు తున్నప్పటికీ డిమాండ్ తక్కువగానే ఉందన్నారు. ధరలు పెరగక ముందు కొన్ని బ్యాంక్‌లు దిగుమతి చేసుకున్న బంగారాన్ని తిరిగి అమెరికాకు పంపిస్తున్నాయన్నారు. దీంతో అధిక రాబడులను పొందుతున్నా యన్నారు. భారత్‌లోని ఆభరణాల తయారీదారుల కోసం టోకుగా ఒక్క ఔన్స్‌పై 23 డాలర్ల తగ్గింపును అందిస్తోన్నాయన్నారు. గతేడాది దీర్ఘకాలంగా అస్థిరంగా ఉన్న ధరలు.. నవంబర్‌లో అకస్మాత్తుగా తగ్గినప్పటికీ.. తిరిగి ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత బంగారం ధరలకు రెక్కలు వచ్చాయి. ట్రంప్‌తో ప్రపంచ దేశాల్లో అనిశ్చిత్తి నెలకొనడంతో సురక్షిత పెట్టుబడి కోసం బంగారంపై సెంట్రల్ బ్యాంక్‌లు, బులియన్ వర్తకులు పెట్టుబడులు పెంచారు. దీంతో రెండు, మూడు నెలల్లోనే బంగారం ధరలు 14 శాతం మేర పెరిగాయి. దేశీయంగా బుధవారం 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.270 తగ్గి రూ.87,970 వద్ద నమోదయ్యింది. 22 క్యారెట్ల ధర రూ.250 తగ్గి రూ.80,650 వద్ద ముగిసింది. వచ్చే నెలలో 10 గ్రాముల ధర రూ.87,300 నుంచి 89,000 వరకు చేరొచ్చని కూడా భావిస్తున్నారు.

# సిపిఎస్ రద్దు ఎప్పుడు?




హైదరాబాద్,ఇటీవల కేంద్ర ఆర్థిక శాఖలో ఉన్న పి.ఎఫ్.ఆర్.డి. ఏ రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం ఇటీవల ఆమోదించిన యుపిఎస్ విధానాన్ని అమలు చేసుకోవాలని లేఖలు రాయడంతో రాష్ట్ర ప్రభుత్వంలో చర్చనీయాంశమైంది. ఈ యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ మసిపూసి మారేడుకాయ చేయడంలో కేంద్ర ఆర్థికశాఖను మించినవారు లేరు. ఇందుకు మరో తాజా ఉదాహరణ టివి సోమనాథం కమిటీ సిఫారసు చేసిన యూనిఫైడ్ పెన్షన్‌కి ఇది చూడడానికి గొప్పగా కనిపిస్తున్నా కరి మింగిన వెలగపండు చందమే అన్న రీతిలో ఉంది. ఇది కేవలం 2024 అక్టోబర్, నవంబర్ మాసాల్లో జరిగిన ఎన్నికల కోసం వచ్చిన పెన్షన్ పథకం.గత ఏప్రిల్, మే నెలలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపికి ఉద్యోగుల సెగ తగిలింది. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన అంశంగా పాత పెన్షన్ పథకాన్ని ఒపిఎస్‌ను పునరుద్ధరణకు కాంగ్రెస్ ఎంచుకుంది. అదే విధంగా బిజెపి సిపిఎస్ స్థానంలో యుపిఎస్‌ను హడావిడిగా ఆమోదించింది. పాత పెన్షన్ పునరుద్ధరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై 20 ఏళ్లుగా చేస్తున్న నిరంతరాయ ఆందోళన ఫలిస్తుందని ఆశించిన ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 24న ప్రకటించిన యూనిఫైడ్ పెన్షన్ విధానం తీవ్ర నిరాశపరిచింది. కేంద్ర ప్రభుత్వం 2023 మార్చిలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానంలో మార్పులు సూచించడానికి ఆర్థిక కార్యదర్శి టివి సోమనాథన్ కమిటీని నియమించింది.ఏడాది తర్వాత దీని సిఫారసుల మేరకు యూనిఫైడ్ పెన్షన్‌కి 2024 ఆగస్టు 24న కేంద్ర కేబినెట్ ఆమోదించింది. ఉద్యోగి కాంట్రిబ్యూషన్, ప్రభుత్వ కాంట్రిబ్యూషన్ మాత్రం అలాగే కొనసాగుతుంది. ఒపిఎస్‌లో 20 ఏళ్ల సర్వీస్ ఉంటే పూర్తి పెన్షన్ వచ్చేది యుపిఎస్‌లో దాన్ని పాతికేండ్లు చేశారు. దీనివల్ల వెనుకబడిన, ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలు రిటైర్మెంట్ తరువాత బి.పి.ఎల్ కుటుంబాలుగా మారే అవకాశం ఉంది. అన్ని ఇస్తామంటూనే ఉద్యోగి నుండి వాటాను అడుగుతున్నది ఈ యుపిఎస్ విధానం. ప్రపంచ బ్యాంకు ఒత్తిడితోనే పెన్షన్ సంస్కరణలు, దాని ఆదేశాల మేరకు ఉద్యోగుల నుండి కచ్చితంగా కాంట్రిబ్యూషన్ వసూలు చేయాలి. దేశవిదేశీ పెట్టుబడిదారులకు, పారిశ్రామిక వ్యక్తులకు అనాయాస పెట్టుబడి సమకూర్చాలి అన్న లక్ష్యంగానే ఈ సిపిఎస్ యుపిఎస్ పెన్షన్ విధానాలు ఉన్నాయి.ఆమోదయోగ్యం కాని ఏకీకృత పెన్షన్ పథకం: ఉద్యోగులకు గౌరవం, ఆర్థిక భద్రతకు భరోసానిచ్చే పథకంగా యూనిఫైడ్ పెన్షన్ స్కీంను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వర్ణించారు. రెండు దశాబ్దాల క్రితం ప్రారంభించిన జాతీయ పెన్షన్ విధానం (ఎన్‌పిఎస్) అత్యంత లోపభూయిష్టం, నిష్ప్రయోజనకరమైనదని కేంద్ర ప్రభుత్వం అంగీకరించినట్లే కదా! అంతమాత్రాన యూనిఫైడ్ పెన్షన్ స్కీం అంత గొప్పదా? అంటే అదేమీ కాదు. జాతీయ పెన్షన్ విధానం కన్నా మెరుగైనదా? వివరంగా పరిశీలిస్తే, యూనిఫైడ్ పెన్షన్ విధానాన్ని ఏ రకంగా చూసినా జాతీయ పెన్షన్ విధానం కన్నా మెరుగైనది కాదు.ఎన్‌పిఎస్ కంటే యుపిఎస్ మెరుగైనదైనప్పుడు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించకుండా మళ్లీ కొత్త పేరుతో యూనిఫైడ్ పెన్షన్ స్కీంను తీసుకురావడం వెనుక కచ్చితంగా కార్పొరేట్ కుట్ర దాగి ఉంది. ఓట్ ఫర్ ఒపిఎస్ పాత పెన్షన్ పునరుద్ధరిస్తామన్న రాష్ట్రం జమ్మూకశ్మీర్‌లో, ఒపిఎస్ ఇచ్చిన జార?ండ్‌లో, హర్యానా, మహారాష్ట్రలలో పోస్టల్ బ్యాలెట్లలో ఆధిక్యం చూపాయి. డిసెంబర్ నెలలో జరిగిన రైల్వే యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో ఒపిఎస్ అంశమే ఆధిపత్యం చెలాయిస్తూ ఎన్నోఏళ్లుగా ఉన్న వ్యవస్థీకృత సంఘాలను ఓడించాయి. అదే విధంగా మన రాష్ట్రంలో గత సాధారణ ఎన్నికల్లో 14 శాసనసభ స్థానాలను గెలుపొందటం కీలకమైంది.సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయుల ఓట్లే. రాష్ట్రంలో ఫిబ్రవరి 27న జరగనున్న రెండు ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ నియోజకవర్గంలో 45 శాతానికి పైగా ఉపాధ్యాయుల ఓట్లు ఉండటం, పట్టభద్రులు సిపిఎస్ కుటుంబ సభ్యుల ఓట్లు 60,900 ఉండటం, కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఒపిఎస్ ప్రకటించడంతో ఆల్‌ఫోర్స్ నరేందర్ రెడ్డికు మద్దతు ఇవ్వడం, అదే విధంగా వరంగల్, ఖమ్మం, నల్గొండ నియోజకవర్గాల్లో 43 శాతానికి సిపిఎస్ ఉపాధ్యాయు ల ఓట్లు ఉండటం, ఈ ఎన్నికల్లో సిపిఎస్ సంఘం నుండి ఎంఎల్‌సి అభ్యర్థులు ఉండటం సర్వత్రా ఆసక్తి నెలకొని ఉంది. మరోసారి పాత పెన్షన్ ఆకాంక్ష తెలుపుటకు, యుపిఎస్‌ను అడ్డువేయుటకు సిపిఎస్ ఉపాధ్యాయులు సిద్ధం అయ్యారో లేదో మార్చి 3 వరకు వేచిచూడాల్సిందే.

### కృష్ణాజలాల్లో తాగునీటికే ప్రాధాన్యం

హైదరాబాద్,తాగునీటికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ రెండు రాష్ట్రాల్లో ఉన్న పంటలను దృష్టిలో ఉంచుకొని శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో ఉన్న నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని కృష్ణానదీ యాజమాన్య బోర్డు సమావేశంలో నిర్ణయించారు. ఛైర్మన్ అతుల్ జైన్ నేతృత్వంలో బోర్డు ప్రత్యేక సమావేశం హైదరాబాద్ జలసౌధలో జరిగింది. తెలంగాణ నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ అనిల్ కుమార్, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఈఎన్సీ వెంకటేశ్వరరావు, ఇంజనీర్లు సమావేశానికి హాజరయ్యారు. రెండు జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటిని వినియోగించుకునే విషయమై సమావేశంలో చర్చించారు. మే నెలాఖరు వరకు తమకు 63 టీఎంసీలు కావాలని

# నా భర్తను వాళ్లే చంపారు.. రాజలింగమూర్తి భార్య సంచలన వ్యాఖ్యలు

భూపాలపల్లి: భూపాలపల్లిలో తొమ్మిది రోజుల క్రితం నాగవెల్లి రాజలింగమూర్తి దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. అయితే రాజలింగమూర్తి హత్యపై విచారణ జరిపించాలని ఆయన భార్య సరళ ప్రభుత్వానికి విన్నవించారు. ఈ క్రమంలోనే తన భర్త హత్యపై వెంటనే సీబీఐ విచారణ జరిపించాలని సీఎం రేవంత్ రెడ్డిని వేడుకున్నారు.సీఎం రేవంత్ రెడ్డికి తన బాధను విన్నవిస్తూ రాజలింగమూర్తి భార్య ఓ వీడియో విడుదల చేశారు. తనకు, తన పిల్లలకు ప్రాణహాని ఉందని సరళ కన్నీళ్లు పెట్టుకున్నారు. తన భర్త రాజలింగ హత్య కేసులో ప్రధాన సూత్రధారి బీఆర్ఎస్ నేత హరిబాబు పరారీలో ఉండడంపై తమకు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని అన్నారు. తన భర్త హత్య వెనుక కేటీఆర్, హరీష్ రావు, గండ్ర వెంకటరమణా రెడ్డి హస్తం ఉందని ఆమె ఆరోపించారు. సీబీఐ ఎంక్వైరీ చేసి అసలు దోషులను పట్టుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి రిక్వెస్ట్ చేశారు. స్థానిక పోలీసులపై తనకు నమ్మకం లేదని చెప్పారు. తాను ఇచ్చిన పిటిషన్ కాదని, మరొక పిటిషన్ లో తనకు తెలియకుండా డీఎస్పీ సంతకం తీసుకున్నారని ఆమె ఆరోపించారు.'నా భర్త చనిపోయి 9 రోజులు గడుస్తున్నాఅసలు దోషులు ఎవరో తెలియడం లేదు. మేడిగడ్డ ప్రాజెక్ట్ కారణంగానే నా భర్తను చంపారు. భూమి తగాదా విషయంలో ఆయనను ఎవరూ చంపలేదు. 2 గుంటల భూమి విషయంలో నా భర్త చనిపోయారని




అంటున్నారు. దానిలో ఏమాత్రం నిజం లేదు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, రమణారెడ్డి కుమ్మక్కై చంపారనే డౌట్ మాకు ఉంది. రమణా రెడ్డి అనుచరుడు హరిబాబు పాత్ర ఎక్కువగా ఉందని మేం అనుకుంటున్నాం. వందల, వేల కోట్ల ప్రాజెక్ట్ విషయంలోనే నా భర్తను చంపారు. చాలా రోజుల నుంచే నా భర్తను చంపాలనే స్కెచ్ వేశారు. కరెంట్ లేని సమయంలో నా భర్తను దారుణంగా హత్య చేశారు. ఈ కేసును సీఎం రేవంత్ రెడ్డి సీబీఐతో విచారణ జరిపించాలి' రాజలింగమూర్తి భార్య సరళ వేడుకున్నారు.

# ముగిసిన మహోత్సవం

ప్రయాగరాజ్,మహాకుంభమేళా సంబరం ముగిసింది. అనూహ్యంగా ప్రపంచమంతా భారత్ వైపు చూసేలా ఈ ఆధ్యాత్మిక క్రతువు సాగింది. కోట్లాదిమంది హాజరై పుణ్యస్నానాలు చేసిన ఇతివృత్తం గతంలో ఎప్పుడూ జరగలేదని చెప్పవచ్చు. ఓ రకంగా ఇది న భూతో..న భవిష్యత్ అన్న తీరుగా సాగింది. 144 ఏళ్లకోసారి వచ్చే మహాకుంభమేళా మహాఘట్టం బుధవారంముగిసింది. జనవరి 13న మొదలైన ఈ మహా కుంభమేళా.. మహా శివరాత్రి పర్వదినంతో ముగిసింది.. చివరి రోజున భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. మహాకుంభమేళాలో మహాశివరాత్రి రోజున 2.5 కోట్లకు పైగా భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించారు.. ప్రయాగ్‌రాజ్‌లోని సంగం ఒడ్డున 45 రోజుల పాటు జరిగిన మహాకుంభమేళాలో ఇప్పటివరకు 65 కోట్ల మందికిపైగా పుణ్యస్నానాలు చేసినట్టు యూపీ ప్రభుత్వం వెల్లడించింది.. చివరి రోజున గణాంకాలు చూసుకుంటే.. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.. ఏడు శైవ అఖారాలకు, మహాకుంభ్–2025 బుధవారం నాడు గొప్ప ఊరేగింపుల తర్వాత కాశీ విశ్వనాథ ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలతో మహాశివరాత్రి నాడు ముగిసింది. ఊరేగింపులో భాగంగా, 10,000 మందికి పైగా నాగ సాధువులు, పండుగ ఉత్సాహాన్ని పెంచుతూ, కాశీ రోడ్ల గుండా తమ దేవతలు, జెండాలతో, త్రిశూలాలు, కత్తులు, గదలను ప్రదర్శిస్తూ 'హర్ హర్ మహాదేవ్' నినాదాల మధ్య పాడుతూ, నృత్యం చేస్తూ ప్రదర్శన చేశారు. శివరాత్రి రోజున పుణ్యస్నానాలు ఆచరించేందుకు ప్రయాగ్‌రాజ్‌కు భక్తులు పోటెత్తారు. చివరిరోజున కుంభమేళాలో భక్తులపై హెలికాప్టర్‌తో పూలవర్షం కురిపించారు.. ఆధ్యాత్మిక యాత్రకు వచ్చే వారిలో మరింత భక్తిభావం పెంచేలా ఇలా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. మహా శివరాత్రి పర్వదినం కూడా కలిసిరావడంతో 'హర హర మహాదేవ్' నామస్మరణలతో త్రివేణీసంగమం ఘాట్లు మార్మోగాయి. కుంభమేళాలో చివరి అమృతస్నానం ఆచరించేందుకు భక్తులు అర్ధరాత్రి నుంచే పెద్దసంఖ్యలో ఘాట్ల వద్దకు చేరుకొన్నట్లు అధికారులు తెలిపారు. దేశం నలుమూలలతోపాటు నేపాల్ నుంచి కూడా భక్తుల బృందం ఒకటి తరలివచ్చింది. కుంభమేళా ప్రాంతంలోని అయిదు ప్రధాన శివాలయాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. బాలీవుడ్ ప్రముఖనటి ప్రీతి జింటా బుధవారం త్రివేణీసంగమంలో పుణ్యస్నానం చేశారు. కుంభమేళాకు తాను రావడం ఇది మూడోసారి అంటూ ఆమె తన 'ఎక్స్' హ్యాండిల్‌లో ఓ వీడియో పోస్టు చేశారు. ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సీనియర్ అధికారులతో కలిసి గోరఖ్‌పుర్ కంట్రోల్ రూములో తెల్లవారుజామున 4 గంటల నుంచే ఏర్పాట్లను పర్యవేక్షించారు. జనవరి 13న మొదలై నాగ సాధువుల ఊరేగింపులు, మూడు అమృత స్నానాలతో వైభవంగా 45 రోజులపాటు కొనసాగిన మహా కుంభమేళా ప్రశాంతంగా ముగిసింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం మొత్తం 65 కోట్లమంది భక్తులు కుంభమేళాను సందర్శించి పుణ్యస్నానాలు చేశారు. జనవరి 29 నాటి రెండో అమృతస్నానం సందర్భంగా రద్దీ వల్ల జరిగిన తొక్కిసలాటలో 30 మంది భక్తులు చనిపోయిన విషాద ఘటన రాజకీయ దుమారం రేపింది. భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ వాంగ్‌ఛుక్, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహా పలువురు కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, పారిశ్రామికవేత్తలు ముకేశ్ అంబానీ, గౌతం అదానీ, సినీతారలు, క్రీడాకారులు త్రివేణీసంగమంలో పుణ్యస్నానాలు చేశారు. ముగింపు వేడుకల్లో భాగంగా భారత వాయుసేన పైలట్లు అద్భుతమైన వైమానిక విన్యాసాలు ప్రదర్శించారు. కుంభమేళాలో భాగంగా మహా శివరాత్రి రోజు చివరి అమృత స్నానం ఆచరించేందుకు కోట్లాది మంది ప్రయాగ్‌రాజ్‌కు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. మహాశివరాత్రి కావడంతో భక్తులు భారీ సంఖ్యలో హాజరవుతుండటంతో మరోసారి యూపీ అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎక్కడికక్కడ ఆంక్షలను అమలు చేస్తూ? అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టింది. కుంభమేళా ప్రాంతాన్ని ఇప్పటికే నో వెహికిల్ జోన్‌గా ప్రకటించి.. సిబ్బందిని భారీగా మోహరించారు. కాగా.. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. ఎప్పటికప్పుడు సీనియర్ అధికారులతో మాట్లాడుతూ.. శివరాత్రి వేడుకలు సజావుగా జరిగేలా చూశారు.

# క్లారిటీ వస్తుందా ?

అమరావతి,ఏపీలో సార్వత్రిక ఎన్నికలు జరిగిన దాదాపు పది నెలల తరువాత జరుగుతున్న ఎన్నికలుగా ఎమ్మెల్సీ ఎన్నికలను చూడాల్సి ఉంది. రెండు పట్టభద్రుల స్థానాలు ఒక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. ఇటు ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళంతో మొదలెడితే అటు కోస్తాలోని క్రిష్ణా జిల్లా దాకా ఉన్న దాదాపు 101 అసెంబ్లీ సీట్లను కవర్ చేసే ఎన్నికలుగా వీటిని చూడాల్సి ఉంది.ఇక గత ఎన్నికల్లో చూస్తే కూటమికి పెద్ద ఎత్తున యువత పట్టభద్రులు విద్యావంతులు సపోర్టు చేశారు. ఈ మద్దతు నూటికి తొంబై శాతం పైగానే అని ఎన్నికల ఫలితాలు వచ్చిన ఓట్లూ నిరూపించాయి. అలాగే ఉపాధ్యాయులు కూడా అత్యధిక శాతం కూటమి సర్కార్ రావాలని బలంగా కోరుకుని మద్దతు ఇచ్చారు. ఇపుడు ఈ కీలక వర్గాలే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయబోతున్నాయి.ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో దాదాపుగా 22 వేల పై చిలుకు టీచర్లు తమ ఓటు హక్కుని వినియోగించుకోవడం ద్వారా తమ మనోభావాలను వ్యక్తం చేస్తారు. అదే విధంగా గోదావరి క్రిష్ణా గుంటూరులలో ఉన్న పట్టభద్రులు విద్యావంతులు తమ ఓటు హక్కుని గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో వినియోగించుకోవడం ద్వారా తొమ్మిది నెలల కూటమి పాలన మీద తమ భావనను వ్యక్తం చేస్తారు.సాధారణంగా ఎన్నికలు లేని వేళ ర్యాండం చెకప్ గా కొన్ని ప్రైవేట్ ఏజెన్సీలు సర్వేలు చేస్తూ ఉంటాయి. ప్రభుత్వం పనితీరు ఎలా ఉంది అని అభిప్రాయ సేకరణ చేస్తూ ఉంటాయి. అయితే అవన్నీ పరిమితమైన శాంపిల్స్ తోనే సాగుతోంది. పూర్తిగా ప్రజల మూడ్ అన్నది వ్యక్తం కాకపోవచ్చు. కానీ ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు మాత్రం అలా కాదు.పూర్తిగా వేలాది ఓటర్లు ఉన్నారు. వారంతా సమాజంలో జరిగే ప్రతీ పరిణామాన్ని గమనిస్తూ తమదైన శైలిలో విశ్లేషించే సత్తా ఉన్న వారు. అందువల్ల వీరు వేసే ఓట్లు ఇచ్చే తీర్పు స్పష్టంగా ఏపీలో రాజకీయ పరిస్థితులను ప్రతిబింబిస్తుంది అని అంటున్నారు. అంతే కాదు కూటమి ప్రభుత్వానికి ఒక విధంగా ఈ ఫలితాలు దిశా నిర్దేశం చేసేలా ఉంటాయని అంటున్నారు.ఈ ఎన్నికల్లో కూటమి తరపున టీడీపీ రెండు సీట్లలో పోటీలో ఉంది. ఉత్తరాంధ్రాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్సీకి మద్దతు ఇస్తోంది. ఈ మూడు సీట్లూ కూటమి గెలుచుకుంటే తిరుగులేదని భావించవచ్చు. ఒకవేళ ఏమైనా ఇబ్బంది కలిగితే అపుడు సీరియస్ గానే ఆలోచించుకోవాల్సి ఉంటుంది. అంతే కాదు ఓటింగ్ ఎలా జరిగింది ఎక్కువ ఓట్లు ఎవరికి పోల్ అయ్యాయి అన్నది కూడా క్రైటేరియాగా తీసుకోవాల్సి ఉంటుంది. అంతిమంగా గెలుపు అన్నది దక్కినా అందులో కూడా లోతైన విశ్లేషణ చేయాల్సి ఉంటుంది. అపుడే ఈ ఫలితాలు అర్థమవుతాయి. ఏది ఏమైనా సరే ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు మాత్రం కూటమి ప్రభుత్వం పనితీరు మీద ఎంతో కొంత ఇచ్చే తీర్పుగానే చూడాలని అంటున్నారు. అలాగే ఏపీలో పొలిటికల్ పిక్చర్ ఎలా ఉంది. మార్పు ఉందా లేదా ఒకవేళ ఉంటే ఏ మేరకు ఏ వర్గాలలో అన్నది కూడా స్పష్టమవుతుంది. అందువల్ల ఈ ఎన్నికల ఫలితాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆషామాషీ అయితే కావనే అంటున్నారు. చూడాలి మరి ఏ రకంగా రిజల్ట్స్ ఉంటాయో.

# డీలిమిటేషన్ అంటే ఏమిటి..?



న్యూఢిల్లీ, ప్రస్తుతం "డీలిమిటేషన్" ప్రక్రియ దక్షిణాది రాష్ట్రాలను భయపెడుతోంది. ముఖ్యంగా తమిళనాడులో ఎంపీ సీట్లు తగ్గుతాయని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆరోపిస్తున్నారు.దక్షిణాది రాష్ట్రాలు మెరుగైన "జనాభా నియంత్రణ" పద్ధతులు పాటించడం ద్వారా పార్లమెంట్ స్థానాలు తగ్గే అవకాశం ఉందని స్టాలిన్ చెబుతున్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో, దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే జనాభా పెరుగుదల ఎక్కువగా ఉండటంతో ఆ ప్రాంతంలో ఎంపీ సీట్ల సంఖ్య పెరిగే అవకాశం ఉందని దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

డీలిమిటేషన్ అంటే ఏమిటి..?

జనాభాలో మార్పుల ఆధారంగా పార్లమెంటరీ, రాష్ట్ర అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దుల్ని తిరిగి మార్చడాన్ని డీలిమిటేషన్ అంటారు. జనాభా ప్రాతిపదికన మెరుగైన ప్రాతినిధ్యం కల్పించేదిగా దీనిని విశ్వసిస్తారు. షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డ్ తెగలు కు ఎన్ని సీట్లు రిజర్వ్ చేయాలో కూడా ఇది నిర్ణయిస్తుంది.రాజ్యాంగంలోని ఆర్టికల్ 82, 170 ప్రకారం, ప్రతీ జనాభా లెక్కల తర్వాత, నియోజకవర్గాల సంఖ్య, వాటి సరిహద్దులను సర్దుబాటు చేస్తారు. తాజా జనాభా లెక్కల డేటా ఆధారంగా, పార్లమెంట్ చట్టం ద్వారా డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేయబడుతుంది.

డీలిమిటేషన్ చరిత్ర:

1951 జనాభా లెక్కల ప్రకారం, 495 సీట్లు(జనాభా 36.1 కోట్లు, ఒక్కో సీటుకు 7.3 లక్షల మంది), 1961లో జనాభా లెక్కల ప్రకారం, 522 సీట్లు ( జనాభా 43.9 కోట్లు, ఒక్కో సీటుకు 8.4 లక్షల మంది), 1971 జనాభా లెక్కల ప్రకారం, 543 సీట్లు (జనాభా 54.8 కోట్లు, ఒక్కో సీటుకు 10.1 లక్షల మంది)గా నిర్ణయించబడింది.1971 తర్వాత దేశంలో 'జనాభా నియంత్రణ' కార్యక్రమాల వేగం పెరగడంతో, అప్పటి నుంచి డీలిమిటేషన్‌ని 25 ఏళ్ల పాటు నిలిపేశారు. 2000 వరకు ఇది అమలులో ఉంది. 2001లో 84వ సవరణ చట్టంతో, 2026 వరకు అంటే మరో 25 ఏళ్ల పాటు నియోజకవర్గాల పెంపుని వాయిదా వేశారు. ప్రస్తుతం లోక్‌సభలో 543, రాజ్యసభలో 250 సీట్లు ఉన్నాయి. అయితే, 2001లో సీట్ల సంఖ్యను మార్చకుండానే, నియోజకవర్గాల సరిహద్దులు సర్దుబాటు చేశారు. 2026లో మరోసారి వీటిని రివ్యూ చేయబడతాయి. 2026 తర్వాత జరిగే మొదటి జనాభా లెక్కల తర్వాతే మార్పులు చేయబడుతున్నాయి.

దక్షిణాది భయాలు ఇవే:

కోవిడ్ మహమ్మారి కారణంగా 2021 జనాభా లెక్కలు ఆలస్యమయ్యాయి. 2026 సమీపిస్తున్న తరుణంలో డీలిమిటేషన్‌పై కసరత్తు మొదలైంది. అయితే, జనాభా ఉత్తరాదిన పెరగడం, దక్షిణాదిన జనభా తగ్గడం చూస్తే, తమ సీట్లు తగ్గుతాయని తమిళనాడు వంటి రాష్ట్రాలు భయపడుతున్నాయి. దీనికి ఇంకో కారణం ఏంటంటే, డీలిమిటేషన్ కసరత్తు మొత్తం పార్లమెంటరీ సీట్లను మార్చకుండానే నియోజకవర్గాలను పెంచవచ్చు, తగ్గించవచ్చు లేదా మార్చవచ్చు. ఇక్కడే దక్షిణాది రాష్ట్రాల అనుమానాలు మొదలయ్యాయి. ఉత్తరాదిన స్థానాలు పెరిగి, దక్షిణాదిన తమ సీట్ల సంఖ్యను తగ్గిస్తారేవెూ అని భయపడుతున్నాయి.2026 నాటికి, దేశ జనాభా 1.41 బిలియన్లకు చేరుకుంది. మరోవైపు మహిళా రిజర్వేషన్ చట్టాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాల్సి ఉంది. 1951, 1961, 1971 జనాభా ఆధారంగా చూస్తే, ఇప్పుడున్న జనాభా ఆధారంగా లోక్‌సభ సీట్ల 543 నుంచి 753కి పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతం 543 లోక్‌సభ సీట్లలో దక్షిణాది రాష్ట్రాల్లో 129 స్థానాలు ఉన్నాయి. తెలంగాణకు 17, ఏపీకి 25, కేరళకి 20, తమిళనాడుకు 39 సీట్లు, కర్ణాటకకు 28 సీట్లు ఉన్నాయి. మొత్తం దక్షిణాది ప్రాతినిధ్యం 24 శాతంగా ఉంది.20 లక్షల జనాభా నిష్పత్తి ఆధారంగా మాత్రమే పరిశీలిస్తే, మొత్తం లోక్‌సభ సీట్లు 753 అవుతాయి. దక్షిణాదికి 144 సీట్లు దక్కే అవకాశంగా కనిపిస్తోంది. ఇందులో తెలంగాణకు 20, ఏపీకి 28, కేరళకు 19, తమిళనాడుకు 41, కర్ణాటకకు 36 సీట్లు వస్తాయని అంచనా. మరోవైపు యూపీలో సీట్ల సంఖ్య 80 నుంచి 128కి, బీహార్‌లో 40 నుంచి 70కి, మధ్యప్రదేశ్‌లో 29 నుంచి 47కి, మహారాష్ట్రలో 48 నుంచి 68కి, రాజస్థాన్‌లో 25 నుంచి 44 సీట్లు పెరిగే అవకాశం ఉంది. ఉత్తరాదితో పోలిస్తే దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గడం ఇక్కడ ప్రధాన సమస్య.

# ఇడ్లీ-సాంబార్, వడాపావ్ వల్లే గోవాకు టూరిస్టులు రావట్లేదు

గోవా : మన దేశంలో అత్యధిక మంది పర్యాటకులు వెళ్లే కీలక ప్రాంతాల్లో గోవా ఒకటి. గోవాలోని బీచ్‌లలో సేదతీరేందుకు దేశం నలుమూలల నుంచే కాకుండా.. అధిక సంఖ్యలో విదేశీ పర్యాటకులు కూడా వాలిపోతారు. ఎప్పటినుంచో గోవా అంటేనే ఒక టూరిస్ట్ స్పాట్. అయితే గత కొంత కాలంగా గోవా టూరిజం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. రాను రాను గోవాకు వచ్చే పర్యాటకుల సంఖ్య తగ్గిపోతుండటం.. ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ఈ సమయంలోనే తాజాగా గోవాలో అధికార బీజేపీకి చెందిన ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి కారణం అయ్యాయి. గోవా బీచ్‌లలో ఇడ్లీ-సాంబార్, వడా పావ్‌లు విక్రయించడం వల్లే విదేశీ పర్యాటకుల సంఖ్య తగ్గిందని బీజేపీ ఎమ్మెల్యే మైఖేల్ లోబో చేసిన వ్యాఖ్యలు సర్వత్రా విమర్శలకు కారణం అయ్యాయి.నార్త్ గోవాలోని కలంగూట్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మైఖేల్ లోబో.. గోవా పర్యాటకంపై కీలక వ్యాఖ్యలు చేశారు. గత కొంతకాలంగా గోవాలో పర్యాటకుల సంఖ్య తగ్గిందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి పలు కారణాలు కూడా ఉన్నాయని తెలిపారు. కర్ణాటక రాజధాని బెంగళూరు నుంచి గోవాకు వచ్చిన వారు బీచ్‌లలో ఏర్పాటు చేసిన దుకాణాల్లో వడా పావ్‌లు అమ్ముతున్నారని.. మరికొందరు ఇడ్లీ-సాంబార్ విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. అందుకే గత 2 ఏళ్లుగా గోవా బీచ్‌లకు విదేశీ పర్యాటకులు రావడం తగ్గిపోయిందని తెలిపారు. గోవా పర్యాటకం తగ్గిపోవడంతో స్థానికుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోందని ఎమ్మెల్యే మైఖేల్ లోబో వెల్లడించారు.అయితే ఇడ్లీ-సాంబార్, వడా పావ్ అమ్మకాలు గోవా టూరిజంపై ఎలాంటి ప్రభావం చూపుతున్నాయనే విషయం మాత్రం మైఖేల్ లోబో వెల్లడించలేదు. కానీ గోవా పర్యాటకం తగ్గిపోవడం వెనుక అనేక కారణాలు ఉన్నాయని చెప్పారు. ఉక్రెయిన్, రష్యా యుద్ధం కారణంగా.. ఆ రెండు దేశాలకు చెందిన పర్యాటకులు గోవాకు రావడం మానేశారని పేర్కొన్నారు. అంతేకాకుండా గోవాలో ఫారిన్ టూరిస్ట్‌ల సంఖ్య తగ్గడానికి తమ ప్రభుత్వం ఒక్కటే కారణం కాదని తెలిపారు. అందుకు అందరూ



బాధ్యులేనని అన్నారు.దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి గోవాకు వచ్చిన వారికి.. స్థానికులు తమ షాప్‌లను రెంట్‌కు ఇవ్వడంపై ఎమ్మెల్యే మైఖేల్ లోబో తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గోవా టూరిజం పడిపోవడానికి.. విదేశీ టూరిస్ట్‌లు తగ్గిపోవడానికి గల కారణాలు తెలుసుకునేందుకు గోవా టూరిజం శాఖతో పాటు సంబంధిత అధికారులతో కలిసి సంయుక్తంగా భేటీ అయి చర్చించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇక గోవాలోని ట్యాక్సీలు, క్యాబ్‌ల మధ్య అనేక సమస్యలు ఉన్నాయని.. ఈ సమస్యలను పరిష్కరించి.. పరిస్థితులను సరిదిద్దకపోతే గోవా పర్యాటకానికి భవిష్యత్‌లో చీకటి రోజులేనని మైఖేల్ లోబో తీవ్ర హెచ్చరికలు చేశారు.సాధారణంగా డిసెంబర్ 31, జనవరి 1 న్యూ ఇయర్ సందర్భంగా గోవా బీచ్‌లన్నీ టూరిస్ట్‌ల రద్దీతో కిటకిటలాడు తుండగా.. అయితే ఇటీవల మాత్రం అంత సందడి కనిపించలేదనే వార్తలు వెలువడ్డాయి. దీనిపై గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్.. తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు.. పర్యాటకులు లేక గోవా ఖాళీ అయిపోయిందంటూ పేర్కొనడం గోవా సీఎంకు తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించింది. ఇలాంటి పుకార్లు వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# మెట్రోను అడ్డుకున్నట్లు రుజువు చేస్తారా



న్యూఢిల్లీ,ఎవరిని అడిగి ఎన్నికల హామీలు ఇచ్చారు...ఎవరిని మీరు విమర్శిస్తున్నారని సిఎం రేవంత్ రెడ్డిపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. మెట్రో రెండోదశను అడ్డుకున్నట్లు రుజువులు చూపాలని సవాల్ చేశారు. విస్తరణకు పైసా లేకున్నా పనులు ఎలా చేపడతారని కూడా ఎదురు ప్రశ్నించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన విమర్శలపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. తాను ఏదైనా ప్రాజెక్టును అడ్డుకున్నట్లు నిరూపించాలని సవాల్ విసిరారు. హైదరాబాద్ మెట్రో రెండోదశ ప్రాజెక్టును కేంద్ర క్యాబినెట్ వద్దకు వెళ్లకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారని రేవంత్ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. సీఎంగా ఉన్న వ్యక్తి అవగాహనా రాహిత్యంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి తెలంగాణకి సీఎం కావడం రాష్ట్ర ప్రజల దురదృష్టం. కేంద్ర ప్రభుత్వానికి ఒక విధానం ఉంటుంది.. దానికి అనుగుణంగానే వ్యవహరిస్తారు. రేవంత్ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతూ దుందుడుకుగా వ్యవహరిస్తున్నారు. కేంద్రం నుంచి డబ్బులు తెచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని ఎన్నికల్లో చెప్పారా?' అని కిషన్‌రెడ్డి నిలదీశారు. తెలంగాణకు సిఎం రేవంతా లేక తానా అని ప్రశ్నించారు. ప్రధాని మోడీ నాయకత్వంలో మైనింగ్‌లో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. గనుల శాఖలో నూతన పాలసీ తీసుకొచ్చామని.. 12 ఖనిజాల రాయల్టీని పెంచామని తెలిపారు. ఈ ఏడాది జీఎస్ఐ 448 ప్రాజెక్టుల్లో గనుల అన్వేషణ చేపట్టిందని పేర్కొన్నారు. గనుల అన్వేషణలో ప్రైవేట్ రంగాన్ని కూడా భాగస్వా మ్యం చేస్తున్నామని.. ఇందులో భాగంగానే ఈ ఏడాది 12 ప్రైవేట్ కంపెనీలు గనుల అన్వేషణలో భాగస్వామ్యం అయ్యాయని తెలిపారు. ఆఫ్ షోర్ ఏరియాలో ఖనిజాల ఉత్పత్తిని పెంచుతున్నామన్నారు. పలు ఆఫ్ షోర్ మినరల్స్ గుర్తించి వేలం వేయబోతున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 103 బ్లాకుల గనులను వేలం వేశాయని..ఈ వేలం ప్రక్రియలో 14 రాష్ట్రాలు భాగస్వామ్యం అయ్యాయని తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పై దృష్టి పెట్టామని పేర్కొన్నారు. మెట్రో రెండోదశ ప్రాజెక్టును కేంద్ర క్యాబినెట్ వద్దకు వెళ్లకుండా కిషన్‌రెడ్డే అడ్డుకున్నారు. తన మిత్రుడు కేసీఆర్ పదేళ్లలో చేయని పని ఇప్పుడు చేస్తే రేవంత్‌రెడ్డికి పేరొస్తుందనే అలా చేశారని రేవంత్ ఆరోపించారు. నాకు రాష్ట్ర ప్రయోజనాల కంటే పేరు ముఖ్యం కాదు. కావాలంటే అనుమతులు, ని ధులు తెప్పించి ఆ పేరును కిషన్‌రెడ్డినే తెచ్చుకోమనం డి. నేను కూడా ఆయన పేరే ఊరూరా ప్రచారం చేస్తా. సన్మానం చేసి గండపెండేరం తొడుగుతా. తెలంగాణ అభివృద్ధికి అవసరమైన 5 ప్రాజెక్టులకు సహకరించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి విన్నవించాం. వాటికి అనుమతు లు, నిధులు తీసుకురావాల్సిన బాధ్యత కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి,బండి సంజయ్‌లదే. లేకపోతే వారిద్దరూ గుజరాత్‌కో.. ఇంకో రాష్ట్రానికో వెళ్లిపోవాలి. తెలంగాణలో వారికి తిండి దండగ' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దీనికి కిషన్ రెడ్డి ఘాటుగా బదులిచ్చారు.

# ఎన్ని చట్టాలు చేసినా..కఠినంగా అమలు చేయాలి




ముంబై,మహిళల రక్షణ కోసం తీసుకొచ్చిన చట్టాలను సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని సుప్రీం మాజీ సిజె జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు.. ఎక్కడికి వెళ్లినా తాము సురక్షితంగా ఉన్నామనే నమ్మకాన్ని మహిళలకు కలిగించాలన్నారు. ఇలాంటి కేసుల్లో సరైన దర్యాప్తు, కఠిన చర్యలు అత్యంత కీలకం అన్నారు.. న్యాయవ్యవస్థ, పోలీసులకు పెద్ద బాధ్యత ఉంది. వీరితో పాటు సమాజానికి కూడా అంతే బాధ్యత ఉందని జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. మహారాష్ట్రలోని పుణెలో 26 ఏళ్ల యువతిపై బస్సులో ఓ దుండగుడు అత్యాచారానికి పాల్పడిన ఘటన ప్రజల్లో ఆగ్రహానికి కారణమైంది. రాజకీయంగా దుమారం రేపుతోంది. దీనిపై సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ కీలక వ్యాఖ్యలు చేశారు .నిర్భయ ఘటన తర్వాత చట్టాల్లో ఎన్నో మార్పులు వచ్చాయి. కేవలం చట్టాలతోనే అలాంటి ఘటనలను నివారించలేం.అందుకు ప్రభుత్వం, పోలీసులు, ప్రజలు కూడా బాధ్యతతో వ్యవహరించాల్సి ఉందన్నారు. అత్యంత రద్దీగా ఉండే బస్ స్టేషన్‌లలో ఒకటైన స్వర్‌గేట్‌లో మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఈ దారుణం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. తన స్వగ్రామానికి వెళ్లేందుకు బస్‌స్టేషన్‌కు చేరుకున్న యువతితో నిందితుడు మాటలు కలిపాడు. అక్క అని సంబోధిస్తూ నమ్మించాడు. గ్రామానికి వెళ్లే బస్సు మరో చోట ఉందని చెప్పి బస్ స్టేషన్‌లోనే దూరంగా ఎవరూ లేని చోట ఆగి ఉన్న మహారాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్ దగ్గరకు ఆమెను తీసుకెళ్లాడు. బస్సులోకి వెళ్లేందుకు యువతి తటపటాయించడంతో లోపల ప్రయాణికులు ఉన్నారని.. నిద్రలో ఉండటంతో వాళ్లు లైట్లు వేసుకోలేదని నమ్మించాడు. బస్సులోకి యువతి ప్రవేశించగానే తలుపు వేసి అత్యాచారానికి పాల్పడ్డాడు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడు దత్తాత్రయ రామదాస్ (36)గా పోలీసులు గుర్తించారు. అతడిపై అనేక కేసులు ఉన్నాయని, 2019 నుంచి బెయిల్ మీద ఉన్నాడని తెలిపారు. రామదాస్‌ను పట్టుకొనేందుకు 8 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అత్యాచారం జరిగిన ప్రాంతానికి 100 మీటర్ల దూరంలోనే పోలీస్ స్టేషన్ ఉండటం గమనార్హం. నిందితుడి గురించి సమాచారం ఇచ్చిన వారికి రూ.లక్ష రివార్డు ఇస్తామని పుణె పోలీసులు వెల్లడించారు. ఇక ఈ ఘటనపై మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందే స్పందించారు. ఈ కేసుపై తమ ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టిసారించిందని, నిందితుడిని త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు.

# తెలంగాణ ప్రాజెక్టుల బాధ్యత కిషన్ రెడ్డిదే



సిద్దిపేట, తెలంగాణలోని ప్రాజెక్టులు పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశారని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. గత పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న తమ నాయకుడిని బీఆర్ఎస్ పార్టీ సంప్రదించలేదని రాష్ట్రానికి ఏం కావాలో అడగలేదని.. ప్రధాని వస్తే కేసీఆర్ కలవడంలేదని ఏదేదో చెప్పి కాలం గడిపారని చెప్పారు. తెలంగాణ ప్రాజెక్టుల కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎంపీలు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని చాలాసార్లు కలిసి అడిగామని గుర్తుచేశారు. ఫెడరల్ వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం అనే సంబంధాల దృష్ట్యా రాష్ట్రానికి అవసరమైన అన్ని ప్రాజెక్టులు అడుగుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా హుస్నాబాద్ టౌన్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటు హక్కును మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు వినియోగించు కున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... రాష్ట్రానికి రావాల్సిన ఏ ప్రాజెక్టు రాకపోయినా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బాధ్యత వహించాల్సి ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇప్పటి వరకు మెట్రో మలిదశ , మూసీ, ఓఆర్ఓఆర్, ట్రిపుల్ ఆర్ , హైదరాబాద్ తాగునీటి సమస్య ఇతర కార్యక్రమాలకు సంబంధించి ఉపాధి అవకాశాలు మెరుగుపడే అంశాలకు సంబంధించి అనేకమైన ప్రాజెక్టులు కేంద్రానికి సమర్పించామని తెలిపారు. కేంద్రం తెలంగాణ రాష్ట్ర విభజనకు సంబంధించిన హామీలు నెరవేర్చాల్సి ఉందని అన్నారు. కిషన్ రెడ్డి రాష్ట్రానికి నిధులు తేకపోతే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ వేరు కాదని గమనించాల్సి వస్తోందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఢిల్లీలో దోస్తీ గల్లీలో కుస్తీ అని ముందు నుంచి చెబుతున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం దేశానికి రోల్ మోడల్‌గా తీసుకున్న కుల సర్వేపై మొదటి వారంలో శాసన సభలో చట్టం చేసి రాజకీయ విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చేసే తీర్మానాన్ని చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కేంద్రం ఎప్పుడైతే ఈబీసీకి సంబంధించి షెడ్యూల్లో మార్చుకున్నారో అదేవిధంగా దీనిని కూడా దాని మాదిరిగానే మార్చాల్సిందేనని.. రాజకీయ కారణం చూపిస్తే సరిపోదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గుజరాత్‌లో ప్రధాని మోదీ స్టేట్మెంట్ ఉంది దాని మాదిరిగానే రిజర్వేషన్లు ఇస్తున్నామని అన్నారు. కొంతమంది నేతలు తప్పుడు ప్రచారాలు చేసి మత పరమైన పబ్బం గడుపుతున్నారని మండిపడ్డారు. పాకిస్తాన్ – ఇండియా అంటూ నేతలు రెచ్చగొడుతున్నాని ధ్వజమెత్తారు. తమకు తెలంగాణ ప్రయోజనాలు ప్రజల అభివృద్ధి ముఖ్యమని స్పష్టం చేశారు. తమిళనాడులోఎన్ని రాజకీయ విభేదాలు ఉన్న అభివృద్ధి ప్రయోజనాలు విషయంలో అందరూ ఒక్క మాట మీదనే ఉంటారని చెప్పారు. తెలంగాణకు సంబంధించిన ప్రయోజనాల విషయంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతో కేంద్రంలో ఉన్న బీజేపీ కలిసి వచ్చి పెద్దన్న పాత్ర పోషించి నిధులు కేటాయించే ప్రయత్నం చేయాలని కోరారు. అది కేంద్ర ప్రభుత్వం బాధ్యతని.. లేదంటే తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. మాజీ మంత్రి కేటీఆర్ మాటలు వింటే నవ్వువస్తోందని విమర్శించారు. ఢిల్లీలో కాంగ్రెస్ ఓడిపోతే ట్వీట్ చేస్తున్నారు.. పంటలు ఎండిపోతే ట్వీట్ చేస్తున్నారని చెప్పారు. తమ ప్రభుత్వం తాగు, సాగు నీటికి చర్యలు తీసుకుంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# భారత్‌పై టారిఫ్‌ల కత్తి!

న్యూఢిల్లీ,అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ హెచ్చరికలకు కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు తలొగ్గినట్టే కనిపిస్తున్నది. తమ దేశ వస్తూత్పత్తులపై అధిక సుంకాలను వేస్తున్న దేశాలకు ప్రతీకార సుంకాలు తప్పవని అగ్రరాజ్య అధ్యక్షుడు ఈమధ్య కాలంలో పదేపదే చెప్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో భారత్‌కూ సుంకాల పోటు ఉంటుందని ఇటీవలి అమెరికా పర్యటనలో ప్రధాని మోదీకి ట్రంప్ నిర్మొహమాటంగా చెప్పిన సంగతీ విదితమే. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైనట్టు తెలుస్తున్నది. ఇందులో భాగంగానే అమెరికా నుంచి భారత్‌కు వస్తున్న వివిధ రకాల దిగుమతులపై ప్రస్తుతం విధిస్తున్న సుంకాలను తగ్గించేందుకున్న అవకాశాలను అన్వేషిస్తున్నట్టు సంబంధిత అధికార వర్గాలు చెప్తున్నాయి.

ఇదీ సంగతి..

కార్లు, మోటర్‌సైకిళ్లు తదితర ఆటోమొబైల్స్, వ్యవసాయ ఉత్పత్తులు, రసాయనాలు, కీలక ఔషధాలు, కొన్ని వైద్య పరికరాలు, ఎలక్ట్రానిక్స్, విస్కీసహా మరికొన్నింటిపై వసూలు చేస్తున్న సుంకాలను తగ్గించే వీలుందంటున్నారు. తద్వారా అమెరికా అధిక సుంకాల నుంచి తప్పించుకోవచ్చన్న అభిప్రాయాలను వారు వ్యక్తం చేస్తున్నారు. నిజానికి కేంద్ర ప్రభుత్వం.. అమెరికా సుంకాలను తప్పించుకోవడానికి ఇప్పటికే నిర్దేశించుకున్న సుంకాల కోత కంటే ఇంకా ఎక్కువగానే టారిఫ్‌లను తగ్గించాల్సి రావచ్చన్న అంచనాలను వారు వెలిబుచ్చుతుండటం గమనార్హం. దీంతో చాలారకాల వస్తు, సేవల దిగుమతులపై పెద్ద ఎత్తునే సుంకాలు తగ్గవచ్చని చెప్తున్నారు.

అమెరికాతో మైత్రి

ప్రస్తుతం అమెరికా సుంకాల హెచ్చరికలు.. యావత్తు ప్రపంచ వాణిజ్యాన్నే వణికిస్తున్నాయి. ఇప్పటికే స్టాక్, కరెన్సీ, కమోడిటీ మార్కెట్లపై ఆ ప్రభావం కనిపిస్తున్నది చూస్తూనే ఉన్నాం. ఈ క్రమంలో ఆయా దేశాలతోపాటు భారత్ సైతం అమెరికాతో స్నేహపూర్వక వాతావరణానికి ప్రయత్నిస్తున్నది. ముఖ్యంగా చైనాతో వాణిజ్య యుద్ధానికి ట్రంప్ కాలుదువ్వుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న అవకాశాలను భారత్ అందిపుచ్చుకునేందుకు చొరవ చూపాలని మెజారిటీ ఆర్థిక నిపుణులు సలహా ఇస్తున్నారు. నిజానికి గ్లోబల్ మార్కెట్‌లో చైనాకు చెక్ పెట్టాలంటే భారత్‌ను ప్రోత్సహించడమే మార్గమని అమెరికా సైతం భావిస్తున్నది. దీంతో అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్యం బలోపేతంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారిస్తున్నది. మరోవైపు భారత్‌కు రక్షణపరమైన ఎగుమతుల్ని పెంచాలని అమెరికా చూస్తున్నది. అయితే ఇప్పుడు రష్యా నుంచే ఎక్కువగా ఇక్కడికి వస్తున్నాయి. ఫలితంగా రష్యాతో సంబంధాలు చెడకుండా ట్రంప్ మెప్పును పొందే పనిలో మోదీ సర్కారున్నట్టు చెప్తున్నారు. ఇక 2030 నాటికి ఇరు దేశాల వాణిజ్యం 500 బిలియన్ డాలర్లకు చేరాలని అటు అమెరికా,




ఇటు భారత్ లక్ష్యంగా పెట్టుకున్నాయి. 2023లో ఇది 127 బిలియన్ డాలర్లే.

మెక్సికో, కెనడాలపై టారిఫ్‌లు?

పొరుగు దేశాలైన మెక్సికో, కెనడాలపై టారిఫ్‌లను మంగళవారం నుంచి విధించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భావిస్తున్నట్టు సమాచారం. అలాగే చైనా నుంచి వచ్చే దిగుమతులపై 10 శాతం యూనివర్సల్ టారిఫ్‌ను రెట్టింపు చేయాలని కూడా చూస్తున్నట్టు తెలుస్తున్నది. కాగా, అమెరికాలోకి ఎంతమాత్రం ఉపేక్షించని విధంగా మనుషుల అక్రమ రవాణా, ఔషధాల స్మగ్లింగ్ జరుగుతున్నదని, వీటికి అడ్డుకట్ట వేసేందుకు అధిక సుంకాలు ఒక్కటే మార్గమని ట్రంప్ అనుకుంటున్నారు.

# రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యం నడుస్తోంది

కడప,రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని, రెడ్ బుక్ రాజ్యం నడుస్తోందని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ భాష అన్నారు. పోసాని కృష్ణమురళి అరెస్ట్ ఇందుకు నిదర్శనమని అన్నారు.ఆయన మీడియాతో మాట్లాడుతూ విమర్శలను కూటమి ప్రభుత్వం తట్టుకోలేక పోతుందని అన్నారు. అందుకే పోసాని అరెస్టు చేశారని తెలిపారు. ప్రజల రక్షణకు కాక రాజకీయ పక్షులకు పోలీసులను కూటమి ప్రభుత్వం వాడుకుంటుందన్నారు. పోసాని అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపైన కక్ష సాధింపు చర్యలు అమలు చేస్తున్నారన్నారు. రాత్రి సమయంలో ఆరోగ్యం బాగాలేదని చెబుతున్న పట్టించుకోకుండా అరెస్టు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వ అవినీతిని లేవనెత్తి తే వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. ప్రజలకు రక్షకులుగా ఉండాల్సిన పోలీసులను రాజకీయ కక్షలకు వాడుకుంటున్నారని ఘాటుగా విమర్శించారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com